**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్నికలు ఆసన్నమవడంతో గ్రామ,వార్డు వాలంటీర్లుపై రాజకీయ పార్టీలు గురిపెట్టాయి.వీటికి వత్తాసుగా నిలిచే స్వచ్ఛంధ సంస్థలు ఆ దిశలో న్యాయపోరాటాలుచేస్తున్నాయి. ఎన్నికలకు వాలంటీర్లును వినియోగిస్తున్నారంటూ హైకోర్టులో మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ సారథ్యంలోని సిటిజెన్ ఫర్ డెమోక్రసీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ ఈరోజు హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది.విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాదులు తమ వాదనలనువిన్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను ఇచ్చినా ప్రభుత్వం అమలు చేయడం లేదని హైకోర్టు దృష్టికి తీసుకుని వెళ్లారు. పిటిషనర్ వాదనలపై స్పందిస్తూ ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఆదేశాలు జారీ చేస్తున్ననట్లు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తెలిపింది.

# బిజెపి రెండో జాబితాలో 72 మంది




**న్యూఢిల్లీ, మార్చి 13:** భారతీయమ జనతాపార్టీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల రెండో జాబితాను బుధవారం విడుదలచేసింది. అనేకమందిప్రముఖులు, కేంద్రమంత్రులు ఈ జాబితాలో ఉన్నారు. కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, పియూష్‌గోయల్, అనురాగ్‌ఠాకూర్, హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. మొత్తం 72 మంది పేర్లతో బిజెపి హైకమాండ్ జాబితానుప్రకటించింది. ఈ జాబితాలో పదిరాష్ట్రాలకు సంబంధించిన అభ్యర్థులున్నారు. వీరిలోకర్ణాటక, గుజరాత్; మహారాష్ట్ర అభ్యర్థులను కూడా కొందరినిప్రకటించింది. కర్ణాటక మహారాష్ట్రలనుంచి 20 మంది చొప్పున ప్రకటిస్తే గుజరాత్‌లో ఏడుస్థానాలు, హర్యానా, తెలంగాణ రాష్ట్రాల్లో ఏడు స్థానాల చొప్పున ప్రకటించింది. మధ్యప్రదేశ్‌లో ఐదు, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో రెండేసి స్థానాలు, త్రిపుర, దాద్రా నాగర్ హవేలి, డామన్ దయ్యూ స్థానాల్లో ఒక్కొక్కరు చొప్పున అభ్యర్థులను బిజెపి ప్రకటించింది. గతవారంలోనే బిజెపి 195 మంది అభ్యర్థులతో తొలిజాబితానుప్రకటించింది. తర్వాత రెండోసారి విస్తృత మదింపు తర్వాత జాబితాను బుధవారం విడుదలచేసింది. ప్రధానిమోడీ రెండోసారి కూడా వారణాసినుంచే పోటీచేస్తారు. అమిత్‌షా గుజరాత్‌లోని గాంధీనగర్‌నుంచి పోటీలో ఉంటారు. పార్టీ ఇప్పటివరకూ యుపిలో 51స్థానాలు, పశ్చిమబెంగాల్‌లో 20, మధ్యప్రదేశ్‌లో 24, గుజరాత్; రాజస్థాన్‌లో 15 చొప్పున విడుదలచేసింది. కేరళలో 12, తెలంగాణలో తొమ్మిది, అస్సాంలో 11, జార్ఖండ్, ఛత్తీస్‌ఘర్‌లలో 11 స్థానాలు చొప్పున ప్రకటించగా ఢిల్లీలోఐదు, జమ్ముకాశ్మీర్‌లో రెండు, ఉత్తరాఖండ్‌లోమూడు, అరుణాచల్‌ప్రదేశ్‌లో రెండు, గోవా, త్రిపుర, అండమాన్ నికోబార్, డామన్ దయ్యూల్లో ఒక్కొక్కస్థానం ప్రకటించింది. ముఖ్యమంత్రిపదవికి రాజీనామాచేసిన హర్యానా సీఎం తన శాసనసభ్యత్వానికి కూడా రాజీనామాచేసారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కర్నాల్ లోక్‌సభ స్థానంనుంచి పోటీచేస్తారు. పియూష్‌గోయల్ ముంబయినార్త్, అనురాగ్‌ఠాకూర్ హిమాచల్‌లోని హమీర్‌పూర్‌స్థానాల్లో పోటీచేస్తారు. ఇక బిజెవైఎం చీఫ్ తేజస్విసూర్య బెంగళూరుసౌత్, పార్టీ జాతీయ కార్యదర్శి పంకజ ముండే మహారాష్ట్రలోని బీడ్ నుంచి పోటీలో ఉంటారు. ఇక కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ నాగ్‌పూర్‌నుంచి కర్ణాటక మాజీ సీఎం బసవరాజ్‌బొమ్మై హావేరినుంచి పోటీచేస్తారు. అలాగే తూర్పు ఢిల్లీనుంచి హర్ష్ మల్హోత్రాను ప్రకటించింది.

వార్త

కోపం తెలివి తక్కువ తనంతో ప్రారంభమై,
పశ్చాత్తాపంతో అంతం అవుతుంది.

-పైథాగరస్

# మిస్టరీగానే మిస్సింగ్ కేసులు

దేశంలో రోజురోజుకుపెరిగిపోతున్న మిస్సింగ్ కేసుల సంఖ్యపట్ల ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ కేసుల దర్యాప్తుల్లో సంబంధిత అధికారులు అంతగా శ్రద్ధచూపడం లేదనే విమర్శలు వెల్లువుతున్నాయి. వీటిపై పటిష్టమైన చట్టం లేకపోవడం కూడా మరో కారణంగా చెబుతున్నారు. భారత్‌లో అదృశ్యమవుతున్న వారిలో అధికసంఖ్యలో పిల్లలు, మహిళలు ఉండడం ఆందోళన కలిగించే అంశం. మహిళలను పూజ్యభావంతో చూసి, గౌరవించే భారతావనిలో గత మూడేళ్లలో పదిలక్షల అరవైవేల మంది మహిళలు, పిల్లలు అదృశ్యమయ్యారని ఇటీవలరాజ్యసభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వివరించారు. ఒక గౌరవ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ విస్తుపోయే విషయా లు బయటపెట్టారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా గత మూడేళ్లలో రెండు లక్షల ఇరవైఒక్కవేల మంది బాలికలు అదృశ్యమైనట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణలో 2019-2021 వరకు ముప్పైనాలుగు వేల నాలుగు వందల మహిళలు, ఎనిమిది వేల మంది బాలికలు అదృశ్యమయ్యారు. ఇక ఆంధ్రప్రదేశ్ లో ఇరవైరెండువేల రెండువందల డెబ్బైఎనిమిది మంది మహిళలు, ఏడువేల తొమ్మిది వందల మంది బాలికలు అదృశ్యమయ్యారు. అదేకాదు అంతకుముందు పరిశీలించినా యేడాది యేడాదికి ఈ అదృశ్యాలు పెరిగిపోతున్నాయి. 2015-16 మధ్యకాలంలో బాలలు అదృశ్యమైన సంఘటనలు పదహారు శాతం పెరిగినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే కేంద్ర మంత్రి రాజ్యసభలో వివరించిన వివరాలు విబేధిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ కొంతమేరకు వివరణ ఇచ్చారు. అదృశ్యమైన వారిలో అధిక శాతం తిరిగి వస్తున్నారని, వారు అలా తిరిగి వచ్చిన విషయాన్ని బాధిత కుటుంబాలు పోలీసులకు తెలియచేయకపోవడం వల్ల రికార్డుల్లో అదృశ్యాల సంఖ్య అంతగా పెరిగిపోతున్నదని వివరించారు. అంకెలు అంత వాస్తవం కాకపోయినా మిస్సింగ్ కేసులు పెరిగిపోతున్న మాట మాత్రం వాస్తవం. అందుకు రకరకాల కారణాలున్నాయి. కొన్ని సందర్భాల్లో బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. పరిస్థితులను అర్థం చేసుకున్న దేశంలోని అనేక హైకోర్టులు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నా యి. అదృశ్యమైన వారికోసం ఆ కుటుంబ సభ్యులు ఏళ్లతరబడి కళ్లల్లో ఒత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. అనారోగ్యంతోనో, ప్రమాదాల్లోనూ ఇతర కారణాలతో మరణిస్తే బాధ ఉంటుంది. కానీ కాలం గడిచే కొద్దీ రోజువారీ కార్యక్రమాల్లో నిమగ్నం కావడం, ఇతర ఒత్తిడులతో క్రమేపీ ఆ బాధ మరిచిపోతారు. ఆ వ్యక్తి లేని లోటును పూర్తిగా మరిచిపోతారని చెప్పలేం కానీ ఆ వ్యక్తులకు సంబంధించిన జ్ఞాపకాలను అప్పుడప్పుడు నెమరవేసుకుంటూనే ఉంటారు. కొన్ని వర్గాల్లో అయితే చనిపోయిన రోజును గుర్తుంచుకొని కార్యక్రమాలు చేసుకుంటుంటారు. కానీ ఆకస్మికంగా ఎవరైనా అదృశ్యమైపోతే నెలల తరబడి, ఏళ్ల తరబడి ఆచూకీ తెలియకపోతే ఆ కుటుంబం అనుభవిస్తున్న నరకయాతన మాటల్లో వర్ణించలేం. చనిపోయారో, బతికి ఉన్నారో తెలియదు. ఎలాంటి కష్టాల్లో ఉన్నారో, తిరిగి వస్తారో, రారో తదితర ఆలోచనలతో ఆ కుటుంబం అనుభవించే మానసిక క్షోభ వర్ణనాతీతం. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎందరో అదృశ్యమైపోతున్నారు. దశాబ్దాలు దాటిపోతున్నా ఆచూకీ దొరకకుండా పోతున్నది. గుడులు, గోపురాల చుట్టూ తిరుగుతున్నారు. కన్పించిన ప్రతి స్వామికి, బాబాకు మొక్కుతున్నారు. ఆ బాబాలు చెప్పేదంతా అమలు చేస్తున్నారు. ఇందుకు ఎంత డబ్బు వెచ్చిస్తున్నారో చెప్పలేం. ఎన్నో కేసులు పోలీసుల దృష్టికి రాకుండాపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో యువతులు అదృశ్యమైనప్పుడు తమ కుటుంబ ప్రతిష్టకు ఎక్కడ భంగం కలుగుతుందోననే భయంతో పక్కవారికి కూడా తెలియకుండా జాగ్రత్తలు పడుతున్న సంఘటనలు కోకొల్లలు. యువతి అదృశ్యమై తిరిగి వచ్చినా వివాహ తదితర విషయాల్లో సమస్యలు వస్తాయని నోరు విప్ప లేకపోతున్నారు. అయితే నమోదు అయిన కేసుల్లో కూడా పోలీసులు అంతగా పట్టించుకోవడం లేదు. వారికి ఉన్న పనులు, ఒత్తిడి, ప్రాధాన్యత దృష్ట్యా వీటిపై దృష్టి సారించలేకపోతున్నారు. అసలే సిబ్బంది కొరతతో ఉన్న పోలీసు విభాగానికి ముఖ్యంగా నేరాలతోపాటు విఐపి భద్రత లాంటి కార్యక్రమాలు పెరగడంతో వీటిపై శ్రద్ధచూపలేకపోతున్నారు. విఐపి కుటుంబ సభ్యులు ఎవరైనా మిస్స్ అయినప్పుడు పట్టించుకొని దర్యాప్తు చేస్తున్నా ఫలితం రావడం లేదు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకట స్వామి మనువడు అదృశ్యమైన కేసులో రాష్ట్ర పోలీసు కానీ, సిబిఐ అధికారులు కూడా ప్రతిష్టాకరంగా తీసుకొని దర్యాప్తు చేసినా ఇప్పటికీ చిన్న క్లూ కూడా కనుగొనలేకపోయారు. ట్రాన్స్‌పోర్టు విభాగంలో పదవీ విరమణ చేసిన అడిషనల్ కమిషనర్ సైదులు అదృశ్యమైపోయారు. ఇప్పటికీ ఆచూకీ లేదు. అంతకు ముందు కరీంనగర్ జిల్లాలో ఒక పోలీసు ఇన్‌స్పెక్టర్ కుమారుడితోసహా అదృశ్యమైపోయారు. ఇలా ఎందరో అదృశ్యమైపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరం అనుకుంటే చట్టంలో మార్పులు చేయాలి. పోలీసు శాఖలో దీనికో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా వ్యవస్థపైనే విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉంది.

వాస్తవికత లేని కల మూర్ఖుల స్వర్గం లాంటిది. నిద్రపోతూ ఉన్నంతవరకూ అక్కడ ఏదైనా సాధ్యమే.



లోవెల్

చదువుకు క్రమశిక్షణ కూడా తోడైతే బంగారానికి తావి అబ్బినట్లుగా ఉంటుంది.



సర్వేపల్లి రాధాకృష్ణన్

## ప్రజావాక్కు



### అరుణాచల్‌పై చైనా పాత పాట

ఇదేదో పని గట్టుకొని ఆడేనాటకంలా ఉంది. ఒకపక్క పాక్ ఏమో కాశ్మీర్ మాదే అంటుంది. ఇంకో పక్క చైనా ఏమో అరుణాచల్‌ప్రదేశ్ మాదేఅంటుంది. రెండు దేశాలు భారత్‌ను టార్గెట్ చేశాయా అనిపిస్తోంది. భారత్‌లోని ఇరవై తొమ్మిది రాష్ట్రాలు భారత్ భుభాగమే. ఈ విషయాన్ని రెండు దేశాలు గమనిస్తే చాలు. అసలు ఎందుకు వాటికి ఇటువంటి బుద్ధిపుడుతుందో చెప్పలేం. భారత్ స్థితిని చూసి ఓర్వలేక ఇటు ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నాయా అనే విషయం తెలియ లేక ఉంది. కాశ్మీర్ కోసం పాక్, భారత్‌తో యుద్ధం చేసి తగిన మూల్యం చెల్లించుకుంది. ఇక చైనా తనపంచశీల ఒప్పందాన్నే నీరుగార్చింది. వాస్తవంగా ఈ రెండు దేశాలకు బుద్ధిలేదు. భారత్ అంటే గిట్టనట్లుగా కనిపిస్తున్నాయి. ఆసియా ఖండంలో ఉంటూనే సఖ్యత, సహకారం పెంపొందించుకోవాల్సిందిపోయి వివాదాలు సృష్టిస్తున్నాయి. పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పినా తన తీరు మార్చుకోకపోవడం శోచనీయం.

-కనుమ ఎల్లారెడ్డి, అమెరికా

### బొగ్గు కార్మికుల పెన్షన్ పెంచాలి

దేశవ్యాప్తంగా దాదాపు ఆరు లక్షలమంది బొగ్గు పెన్షన్ దారులకు కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం-1998 ప్రకారం కనీస పెన్షన్‌రూ.350 నిర్ణయించబడింది. ఇరవైనాలుగు సంవత్సరాల నుంచి జాతీయ కార్మిక సంఘాలు, బొగ్గు విశ్రాంత ఉద్యోగులసంక్షేమ సంఘాల ఆందోళనలఫలితంగా కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వారి ట్రస్ట్ బోర్డు ప్రతిపాదనమేరకు కనీసపెన్షన్ రూ.1,000లకు కేంద్ర ప్రభుత్వంఆమోదంతెలిపింది. నేటికాలంలో వెయ్యి రూపాయలతో పెన్షన్ దారుల కనీస అవసరాలు తీరేనా? ఇట్టి పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించే వృద్ధాప్య పెన్షన్ రెండువేల రూపాయల కన్నా తక్కువ ఉండటం విస్మయం కలిగిస్తుంది.

-ఆళవందార్ వేణుమాధవ్, హైదరాబాద్

### రైతు సమస్యలను పట్టించుకోండి

ప్రపంచవ్యాప్తంగా రైతులు ఎందుకు రోడ్డు ఎక్కుతున్నారు అని ఆలోచించుకోవాల్సిన సందర్భం ఇది. ఐరోపాలో ఒకప్పుడు కూరగాయల సంక్షోభంఒకవైపు, యుద్ధమేఘాలు మరోవైపు, భారతదేశవ్యాప్తంగా 30నెలలపాటు సాగిన మహారైతు ఆందోళన తెలియపరిచేది ఏమిటి? రైతుల డిమాండ్లను నెరవేర్చి వారి సమస్యలను వెంటనే తీర్చాలి.

-ఎన్.సూర్యప్రకాశ్, నల్గొండ జిల్లా

### ఒంటిపూట బడులు నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒంటిపూట బడులపై స్పష్టత ఇంకా రాలేదు. తెలంగాణరాష్ట్రంలో మార్చి15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటి నుంచి అనే చర్చ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒంటిపూట బడులపై అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఒంటిపూట బడుల గురించిపూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఎండలు పెరుగుతుండడంతో విద్యార్థులు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వెంటనే ఒంటిపూట బడులునిర్వహించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు అధికారులకు వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వం విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించాలని, ఒంటిపూట బడులపై వెంటనే ప్రకటన చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

-వాసిలి సురేష్, నెల్లూరుజిల్లా

### మంచినీళ్ల వ్యాపారం పేరిట అక్రమ దందా

రాష్ట్రంలో మినరల్ వాటర్ పేరిట కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. పల్లెలు, పట్టణాలు, నగరాలలో గుర్తింపు లేని వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చి ప్రజలఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అనుమతులు లేకుండా నీళ్లవ్యాపారం నడుస్తుంది. అధికారులు కూడా మామూళ్లకి ఆశపడి ఈ వాటర్ ప్లాంట్లవైపు చూడడంలేదు. ఒక్కో వాటర్ క్యాన్‌కి రూ.20 నుండి ర.30 వరకు వసూలు చేయడం జరుగుతుంది. మినరల్ నీళ్లు తాగడం వల్ల కీళ్ల నొప్పులు, అనారోగ్యం బారిన పడుతున్నారు. వాటర్ క్యాన్‌లను శుభ్రం చేయకపోవడం వల్ల అడుగుభాగంలో నాచు లాంటి పచ్చని పదార్థం పేరుకుపోయి ఈ నీళ్లు ప్రజలు తాగడానికి వాడడం వలన విరోచనాలు కావడం జరుగుతుంది.

-కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లిజిల్లా

### రోడ్ల దుస్థితి

రాష్ట్రంలో రోడ్లు ఎంతో అధ్వాన్నంగా, దారుణంగా ఉన్నాయి. ప్రమాణాలు పాటించని నాణ్యతలేని రోడ్ల నిర్మాణాలు కారణంగా రోడ్లన్నీ కంకర తేలిపోయి గుంతులతో నిండిపోయాయి. ద్విచక్ర వాహనచోదకులు, ఆటో ప్రయాణికులు నరకాన్ని చూస్తున్నారు. మంచి ప్రమాణాలతో ఆధునిక సాంకేతికతను జోడించి రోడ్ల నిర్మాణం, విస్తరణ జరిగినప్పుడే ప్రజలకు ఊరట.

-తూలుగు రమణారావు, అక్కరాపల్లి

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు e-mail: editpage@vaartha.com

# తాయిలాలు కాదు గెలవడానికి నిజాయితీ ముఖ్యం

**కళ్లకు గంతలతోటే న్యాయదేవత పనిచేస్తున్నట్లు అనిపిస్తుంది కానీ, న్యాయం చేయడంలో లోపం ఎక్కడా చేయదు. ఓటర్ కూడా ఏమీ చూడనట్లే ఉంటాడు కానీ, ఓటు వేసేటప్పుడు నిస్సారిన కళ్లతో తాను కోరుకున్న పార్టీకో నాయకుడికో ఓటు వేసి నిజాయితీగా ఉండే రీతితో ఉండటం ఎన్నోసార్లు చూశాం. అందుకే గెలవబోతున్నట్లుగా ఉన్న వాతావరణాన్ని ఎన్‌డిఎ ఆర్భాటపు ప్రచారాలతో చెడగొట్టుకోకూడదు. అదేవిధంగా ఇండియా కూటమి వచ్చిన అవకాశాలను ప్రతిసారి జారవిడుచుకొని పరుగుపందెంలో వెనకబడకూడదు. గెలవటం ముఖ్యం కాదు. గౌరవ ప్రదంగా ప్రజల విశ్వాసాన్ని రెట్టించిన రీతిలో గెలిచినప్పుడే ఎవరు గెలిచినా, దేశం దేదీప్యమానంగా వెలిగిపోతూనే ఉంటుంది.**



రావులపాటి సీతారాంరావు

రాబోయే లోక్‌సభ ఎన్నికలు అనుకున్నట్లు సజావుగా ప్రధానిగా మోడీనే ఎన్నిక చేసేట్లు జరిగితే ఇండియా ప్రకాశవంతంగా వెలుగుతుంది అనుకోటానికి ఆస్కారం ఉంది. ఇప్పటి అంచనాలు సర్వేలూ అన్నీ మోడీకి, ఎన్.డి.యేకే అనుకూలంగా ఉన్నాయి. కనీసం 370 సీట్లయిన తప్పకుండా రావాలి అని ఎన్‌డియే ప్రభుత్వం పదేపదే చెప్పటంలోనే కొంచెం తేడా కొట్టున్నది. నిజానికి ఇండియా ప్రతిపక్ష కూటమి కకావికలంతో సతమతమవుతున్నది. ఆయారామ్, గయారామ్‌ల ప్రతినిధి బీహార్ నితీష్‌కుమార్ పోనూ పోయాడు, మళ్లీ ఎన్‌డియేలోకి రానూ వచ్చాడు. వెస్ట్‌బెంగాల్ మమతా బెనర్జీకి ప్రతిపక్షాలకు సపోర్టు అంటూనే తన పనేదో తను చేసుకొనిపోతూ సీట్ల విషయంలో అన్నీ నావే అంటున్నది. శివసేనకు ఒకప్పుడు కంచుకోట అయిన మహారాష్ట్ర బీటలు వారి నాయకులు తలా ఒకదారి పట్టారు. ఎవరు ఎక్కడ ఎప్పుడు జంప్ చేస్తారో ఊహించటం కష్టం. శరద్‌పవార్ గాలి మోడీ ఆధ్వర్యంలోని బిజెపి తీసేయటంతో విస్తుపో యిన అతను చిన్నాభిన్నమయిన పార్టీతో బిజెపి కూటమికి సవాలుగా మారే పరిస్థితి లేనేలేదు. ఢిల్లీలోని ఆప్ పార్టీ ఇ.డి, సిబిఐలను ఎదుర్కోలేక సతమతమవుతున్నది. బిజెపి ప్రతిపక్షంగా ఉన్న ఇలాంటి పార్టీల ప్రస్తుత పరిస్థితి ఎన్‌డియె కూటమికి అనుకూలంగానే ఉన్నట్లు కనపడుతున్నది. అయినా సరే ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి, టిడిపి, జనసేనలతో కలిసి కూటమిగా ఏర్పడటం, ఒరిస్సాలో అదే రకమైన ఆలోచనలతో ఉండటం, తెలంగాణా కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలలో మాదిరి ప్రతికూల గాలి వీస్తుందేమోనన్న శంకతో ఈ మధ్యకాలంలో మరింత తమకూటమిని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నది. మా టార్గెట్ 400, ప్రస్తుతం 370 సీట్లు పక్కా అంటున్న ఎన్‌డిఏ విశ్వాసం దెబ్బతీసే సూచనలు పసిగట్టి ఆ విధంగా వారి నాయకులు అంటున్నారా అన్న అనుమానం నిత్య సందేహపరులకు కలుగుతున్నది. కొందరు విదేశీ జర్నలిస్టులు పనిగట్టుకొని మోడి విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నంలో ఉన్నట్లు ఈ కింది రాతలు చూస్తే అర్థం అవుతుంది. దేనియల్ మార్కే ఫారిన్ ఎఫైర్స్ జర్నల్‌లో (2023 జులై, ఆగస్టు సంచికలో) రోల్ మోడల్‌గా లార్జెస్ట్ డెమాక్రసీ, థర్డ్ వరల్డ్ కంట్రీస్‌కు వున్న ఇండియా గత పది సంవత్సరాల నుంచి ఎలక్టోరల్ ఆటోక్రసీగా మారుతున్నది. మోడీ భారతీయ జనతాపార్టీ ఇండియాతో ముడిపడి ఉన్న 'లిబరిలజమ్' పోనుపోను సందేహాస్పదంగా (డూబియస్)గా



మారుస్తున్నది అని విశ్లేషించడం నిస్సందేహంగా మోడీ ఇమేజీని దెబ్బతీసే ప్రయత్నంలో ఒక భాగంగా చెప్పక తప్పదు. కావాలని పనిగట్టుకొని పార్లమెంటును రబ్బర్ స్టాంప్‌గా మార్చారని, బ్యూరోక్రాట్లను పొలిటిసైజ్ చేస్తున్నారని దుష్ప్రచారం కావిస్తుండటం గమనార్హం. అయోధ్యలో శ్రీరామ దేవాలయ నిర్మాణంతోపాటు పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ) అమలులోకి తేవటాన్ని కూడా ప్రభుత్వంలో ఉన్నపార్టీకి ఇబ్బంది కలిగించే రీతిలో ప్రచారం చేయబూనుకోవడం చూస్తుంటే ఫారిన్ జర్నలిస్టులకు ఊపందించే కార్యక్రమంలో మతపరమైన శక్తులు పార్టీలు ఉన్నాయా అన్న అనుమానం ఎవరికైనా కలుగక మానదు. బహుశా ఇలాంటి పరిణామాలను దృష్టిలో పెట్టుకొని మరింత బలపడే ప్రయత్నం చేయడం ఎన్.డి.ఎ చేస్తుండొచ్చు. ప్రతిపక్షాలు ఇలాంటి సందర్భాలలోనే ఎన్నికల పోరాటం వేరు కానీ జాతిగా మేమంతా ఒకటే అన్న ప్రగాఢమైన సంకేతాలు ఇచ్చినప్పుడే దేశభద్రతకు ముప్పు ఉండదు. ఎన్నికలు వస్తాయి, పోతాయి గెలుపు ఓటములు ప్రతీసారి ఒకే పక్షాన ఉండవు అన్న దూరదృష్టితో ఎన్నికలలో తమశక్తియుక్తులను అటు విపక్షాలూ, ఇటు ప్రభుత్వంలోని పక్షాలూ ప్రయోగించినప్పు డే జాతికి గౌరవం ఉంటుంది. భారతదేశం శక్తివంతంగా మారుతుంది. కొత్తగా గ్యారంటీల పథకాల ప్రకటనలతో ఏ పార్టీ ముందుకొచ్చినా ప్రజలు తేలిగ్గా నమ్మరు. ప్రభుత్వంలో ఉన్న పార్టీ ఏవిధంగా అంతకుమునుపు ఇచ్చిన హామీలు పూర్తి కావించింది అని ఇటు రాష్ట్రాలలోనైనా, అటు కేంద్రపరంగా అయినా నిశితంగా గమనించి, నిర్ధారించిన తర్వాతనే ఓటు హక్కును వినియోగించుకుంటారన్న సంగతి విస్మరించకూడదు. నమ్మబలకడం వేరు, నమ్మకంగా చేయడం వేరు. ఆ తేడాను గమనించకుండా పార్టీలు ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తే ఇవ్వాలగాకపోయినా రేపైనా ప్రజలు ఉట్టుట్టి ప్రచారాలు డొల్లతనాన్ని సమయం, సందర్భం చూసి తిప్పి కొట్టారు. తాయిలాలు ఎన్నితీసుకున్నా సగటు ఓటర్ ఇంగి తజ్ఞానాన్ని ఓటు వేసేటప్పుడు కోల్పోడు. నిన్నగాక మొన్న జరిగిన కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను, 2004లో 'ఇండియా షైనింగ్' నినాదంతో ఎన్నికలలోకి వెళ్లినఎన్.డిఏ ఎదురు దెబ్బలు తినటం చూసాం. అదేవిధంగా 2014లో యు.పి.ఏ కూటమి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో కోలుకో లేని దెబ్బతినడం కూడా చూశాం. కళ్లకు గంతలతోటే న్యాయదేవత పనిచేస్తున్నట్లు అనిపిస్తుంది కానీ, న్యాయం చేయడంలో లోపం ఎక్కడా చేయదు. ఓటర్ కూడా ఏమీ చూడనట్లే ఉంటాడు కానీ, ఓటు వేసేటప్పుడు నిస్సారిన కళ్లతో తాను కోరుకున్న పార్టీకో నాయకుడికో ఓటు వేసి నిజాయితీగా ఉండే రీతితో ఉండటం ఎన్నోసార్లు చూశాం. అందుకే గెలవబోతున్నట్లుగా ఉన్న వాతావరణాన్ని ఎన్‌డిఎఆర్భాటపు ప్రచారాలతో చెడగొట్టుకోకూడదు. అదేవిధంగా ఇండియా కూటమి వచ్చిన అవకాశాలను ప్రతిసారి జార విడుచుకొని పరుగుపందెంలో వెనకబడకూడదు. గెలవటం ముఖ్యం కాదు. గౌరవ ప్రదంగా ప్రజల విశ్వాసాన్ని రెట్టిం చిన రీతిలో గెలిచినప్పుడే ఎవరు గెలిచినా, దేశం దేదీప్యమానంగా వెలిగిపోతూనే ఉంటుంది. ●

# ఉపశమనం లేని ఉద్దానం కిడ్నీ విషాదాలు

బద్రి కూర్మారావు

గత 25 ఏళ్లుగా శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత కిడ్నీ వ్యాధి మరణాలతో సతమతమౌతుంది. ఒకప్పుడు వామ పక్ష ఉద్యమాల త్యాగాలతో తడిచిన నేల, నిత్యం పేదరికంతో పొట్టకూటి కోసం దేశవిదేశాలకు వలసపోతున్న ఈ ప్రాంత వాసులు నేడు కిడ్నీ వ్యాధుల బారినపడి వేల సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇచ్చట నుండి అండమాన్ దీవులు, గుజరాత్, భిలాయిలకు వలసపోయిన వారిని కూడా ఈ వ్యాధి విడిచిపెట్టడం లేదు. ఇది ఉద్దానం అంతా నిశ్శబ్ద మరణ శాసనంగా మారింది. ఉద్దానంలో పిల్లలు, పిల్లను కోల్పోయిన తల్లి దండ్రులు ఇలా 7 సంవత్సరాల వయస్సు నుండి 60 సంవత్సరాల పైబడినవారు స్త్రీ, పురుష బేధం లేకుండా నిత్యం చావు డప్పు మోగుతూనే ఉంది. ఈ వ్యాధిని 'క్రోనిక్ కిడ్నీ డీసీజుగా'ను 'ఉద్దానం నెఫ్రోపతి'గాను పిలుస్తున్నారు. ప్రజాసంఘాలు, రచయితలు, స్వచ్ఛంధ సంస్థల అవగాహన సదస్సులు, పత్రికలు, మీడియా, ప్రజానాయకులు వంటివారి రాకతో ప్రభుత్వంలో కదలికవచ్చి జాతీయ, అంతర్జాతీయ వైద్యుల పరీక్షలు చేసిన కారణాలేమి ఇదమిద్ధంగా ఇప్పటికీ తెలియడం లేదు. త్రాగేనీరా? బి.పి., షుగర్ వ్యాధులా? పంటలకు కొట్టే పురుగుమందులా? ఆహారమా? ఏదీ నిజ నిర్ధారణ కాలేదు. అటు ఇచ్ఛాపురం నుండి ఇటు టెక్కలి మండలం వరకు గల ఉద్దానం గ్రామాలలో ఈ సమస్య తీవ్రతరంగా ఉంది. గత 25సంవత్సరాలుగా 35 వేల మరణాలు సంభవించాయని సర్వేలు చెబుతున్నాయి. సాక్షాత్తు టెక్కలి నియోజకవర్గ శాసనసభ్యులు రేవతీపతి, పాలాసనియోజకవర్గ యువ శాసనసభ్యులు జుత్తు జగన్నాయకులు మరికొంత మంది సర్పంచ్‌స్థాయి నుండి మిగతా స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, కళాకారులు కూడా బాధితుల్లో ఉన్నారు. భర్త కోసం భార్యలు కిడ్నీదానం చేసినా దక్కని భర్తలు, కొడుకు కోసం కిడ్నీ దానం చేసినా ప్రాణాలు దక్కించుకోని తల్లిదండ్రులు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వాలు స్పందించి ఉద్దానం సుజలధార (మంచినీటి పథకం)తో పాటు పలాసలో కిడ్నీ వ్యాధుల పరిశోధన కేంద్రం నెలకొల్పారు. కవిటి,



సోంపేట, హరిపురం, పలాస, టెక్కాలి, పాలకొండ, పార్వతీపురంలో డయాలసిస్ కేంద్రాలు నెలకొల్పినా అచ్చట పూర్తిస్థాయి వైద్యులు లేరు. వ్యాధి ముదిరి మంచాన పడిన డయాలిసిస్ రోగులకు ఉచిత మందులు నెలకు రూ. 10,000/-లు ఇస్తున్నా ఇది వారి మరణాన్ని నివారించలేకపోతున్నది. ఇటీవల ఈ వ్యాధి రాష్ట్రంలో పార్వతీపురం, మన్యం జిల్లా (సీతానగరం, నిడగల్లు) అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం కొండపాలెం, ఎన్.టి.ఆర్. జిల్లా ఎ. కొండూరు, తిరువూరు, గంపల గూడెం, మైలవరం వంటి ప్రాంతాలలోని దళిత వాడలు, గిరిజన తండాలలోను, ప్రకాశం జిల్లా కనిగిరి వంటి ప్రాంతాలలో వ్యాపించి నిత్యం మరణ మృదంగం మోగిస్తుంది. ఈ వ్యాధి బారిన పడి నిత్యం సగటున రోజుకొకరు, వారానికొకరు కొన్ని గ్రామాలలో నెలకు ఒకరు చొప్పున మరణిస్తూనే ఉన్నారు. కవిటి మండలం, సహలాలు పుట్టుగ, కపాసకుద్ది, బి.గొణగపుట్టుగ, డి. గొణగ పుట్టుగ, రాజపురం, మందసా మండలం లోహరి బంద, లింబిగాం. బహడపల్లి, నారాయణపురం, భేతాళ పురం, పలాసమండలం, గురుదాసుపురం, రంగోయి, బొడ్డుపాడు, గొల్ల మాక్నపల్లి, వజ్రపు కొత్తూరు మండలం అక్కుపల్లి, గునుపల్లి, బైపల్లి, సైనూరు. మురహరిపురం గ్రామాలలో నిత్యం మరణాలతో మండుతున్న ఈ ప్రాంతంలో ప్రభుత్వంశాశ్వత చర్యలు ఇప్పటివరకు చేపట్టలేదు. రాబోయే తరాలను ఈ వ్యాధి నుండి కాపాడడానికి తీసుకొనే చర్యలేమిటో తెలియడం లేదు. ఎంతమంది ఈ వ్యాధితో బాధపడుతున్నారో సర్వేచేపట్టలేదు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్దానం ప్రాంతంలో ప్రతి గ్రామంలో వ్యాధిగ్రస్తులను గుర్తించాలి. పరీక్షలు జరిపించి ముందుగానే ఈ వ్యాధిబారిన పడకుండా చర్యలు చేపట్టాలి. సీరమ్ క్రియాటిన్ రేటు తక్కుగాఉన్నవారికి కూడా ఉచితంగా పౌష్టికాహారం, మందులు ఇస్తే వారి ఆయుర్దాయం పెరుగుతుంది. అలాగే మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. పరిశోధనకేంద్రంలో వెంటనే పరిశోధనలు ప్రారంభించి వ్యాధికి కారణాలు తెలియజేయాలి. ఈ ప్రాంతంలో ఈ సమస్య పూర్తిగా తొలిగిపోయేంత వరకు ప్రజలలో నిత్యం అవగాహన సదస్సులు నిర్వహించి భావితరాలను కాపాడాలి. సమస్య వచ్చిన తరువాత ఇచ్చిన ఆర్థిక సహాయాలు కంటే సమస్య రాకుండా ముందుగానే మేల్కొవాలి. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని తీవ్రమైన విషయంగా పరిగణించాలి. ఈ ప్రాంతం మరో శ్రీలంకలా కాకుండా చూడాలి. ●

# ఉద్యోగుల సమస్యలకు సరైన పరిష్కారమేది?

మేకిరి దామోదర్

ప్రభుత్వాల పాలనను ప్రజలచెంతకు చేర్చుకుంటూ అభివృద్ధి, సంక్షేమ పాలనా విధానాల అమలులో కీలక భూమిక పోషిస్తూ, పారదర్శక పనితీరుకు ఈ సమాజమనే శారీరక వ్యవస్థకు గుండెకాయ లాంటి వారుగా వ్యవహరిస్తారు ఉద్యోగులు. వారి సమస్యలను గత ప్రభుత్వం హామీ ఇచ్చికూడా, ఏ ఒక్కటి పరిష్కరించకుండా అణచివేత, ఒత్తిడి పెంచింది. అంతేకాదు ప్రజల్లో ఉద్యోగులకు ఎక్కువ జీతాలు ఇస్తున్నామని దుర్మార్గంగా దుష్ప్రచారానికి తెర లేపింది. ఆ వేళ ప్రతిపక్షంగా ఉన్న నేటిపాలకులు ఉద్యోగుల అన్ని సమస్యలు ముమ అధికారం చేప్టిన వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టగానే ప్రభుత్వ ఉద్యోగులందరికీ, పెన్షనర్లు అందరికీ నాలుగేళ్ల తర్వాత ఫిబ్రవరి నెల వేతనాలను ఒకటో తారీకు చెల్లించడం అభినందనీయం. అయినప్పటికీ ఇంకా ఉద్యోగుల చాలా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సతమతమవుతున్నారు. జనవరితో కలిపితే నాలుగు (4) కరవు భత్యం (డీఏ)లు పెండింగ్లో ఉన్నాయి. వాటికోసం ఏడాదికి పైగా ఎదురు చూస్తున్నారు. అదే విధంగా ట్రెజరిల్లో ఆమోదం పొంది రెండేళ్లుగా ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్న జిపిఎఫ్, టిఎస్జీఎల్ఐ, పిఆర్సి బకాయిలు, మెడికల్ రీయింబర్స్మెంట్, పెన్షన్ తదితర బిల్లులన్నీ వెంటనే విడుదల చేయాల్సి ఉంది. పెండింగ్లో ఉన్న మూడు డీఏలతో పాటు ఇకపై డీఏ సకాలంలో ప్రకటించి నేరుగా చెల్లిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మాట నిలుపుకోలేకపోతున్నారు. మరోవైపు ఉద్యోగుల సమస్యలు అసలు సమస్యలేకావనట్టుగా, ఇది ప్రభుత్వాలకు ప్రజలకు చెందిన సమస్య కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఉద్యోగుల సేవలను తక్కువ చేసి చూపించడం, సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల ఊసెత్తకుండా వాటి పరిష్కారం పట్ల నేటికీ ఉలుకు పలుకులేదు. నిత్యావసర ధరలు పెరిగిన దరిమిలా యధాలాపంగా రావలసిన డీఏలు నాలుగు ఇవ్వకుండా ప్రభుత్వం ఇంకా కాలాయాపనచేయడం సబబు కాదు. ప్రభుత్వానికి సంఘాలు విన్నవించినప్పుడు గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసింది. మాకు కొంత సమయం ఇవ్వండి అంటూ సాగదీస్తుంది. ఎన్నికల హామీ ఇచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మేరకు హామీలు ఇవ్వాలి కదా! ఉద్యోగుల సమస్యల పరిష్కారమనగానే బడ్జెట్ లోటు గుర్తుకొస్తుంది. ఒక్కసారి విజ్ఞతతో ఆలోచించండి. వీరి సేవలే లేకపోతే దేశం, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం స్థానం ఎక్కడ? పాలకుల ప్రతిష్ట ఏమౌతోంది. ఫ్రెండ్లీ గవర్నమెంట్ అనే కల్లబొల్లి మాటలు కాదు, సమాజంలో ఉద్యోగుల పనితీరు వల్లనే పాలకుల విలువ మెరుగుపడుతుంది. కానీ గత కొన్నాళ్ళుగా పాలకుల నిర్లక్ష్యంతో ఉద్యోగ, ఉపాధ్యాయులంటేనే! జీతాలు సకాలంలో రావని సమాజంలో చులకన భావం ఏర్పడి రుణాలు పొందలేని దీన పరిస్థితి, వారి పిల్లలకు సంబంధాలు కుదరడంలేదు. సొంతంగా ఒక ఇల్లు కట్టుకోలేకపోతున్నారు. పరపతి పోయి, పరువు పోయి ఇటు



కుటుంబంలో అటు సమాజంలో ఉద్యోగులను తక్కువ చేసి చూడటానికి ముమ్మాటికి ఈ ప్రభుత్వాల దుష్ప్రచార విధానాలే కారణం. నిష్టూరం అయినా యదార్థాన్ని పరిశీలించండి. సేవ చేస్తామనే పేరుతో వచ్చిన ప్రజాప్రతినిధులకు అయ్యే ఖర్చు ఎంతో? వాటి జీతభత్యాలు, అలవెన్స్‌లు, పెన్షన్లు ఇష్టానుసారంగా పెంచుకుంటున్నారు ప్రజా ప్రతినిధులు. ఇది నిజం కాదా! ఎవరిది సేవ, ఎవరిది త్యాగం, ధనం ఎవరికి పోతుంది. ప్రజల్లో బదనాం చేసేది ఎవరిని? ఉద్యోగులకు హక్కుగా రావలసిన జీతాలు, డిఏలు, పెండింగ్ బిల్లుల విషయానికి వచ్చేసరికి బడ్జెట్ లేదనడం ఎంత వరకు సమంజసం. ఇలా ప్రజలను తప్పుదోవ పట్టించడం మంచి పద్ధతి కాదు. వాస్తవాలు గుర్తించి ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ఉద్యోగ సంఘాలు పాలకుల భజనలు చేస్తూ పదవి కోసమో, పైరవీ కోసమో బానిసలయ్యారు. ఎన్నో యేళ్లుగా పోరాడి సాధించుకున్న హక్కుల పాలకుల వద్ద తాకట్టు పెట్టిన (భజన సంఘాల) తీరుతో ఒక్కొక్కటిగా హక్కులను కోల్పోతున్నారు. చివరకు ఉద్యోగులు జీవిత కాలం పొదుపు చేసుకున్న డబ్బులు నిత్యవసరాలకో, కష్టకాలంలోనో, ఆడపిల్ల పెళ్లికో అక్కర కొస్తాయన్న ఆశతో పెట్టుకున్న బిల్లులు కూడా మంజూరు చేయకుండా పెండింగ్ పెట్టింది గత ప్రభుత్వం. నేడు కూడా విడుదల కావడం లేదు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వాలు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించక పోవడంతో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అయినా ప్రభుత్వాలకు ఏం పరిష్కరించాలనే చిత్తశుద్ధి ఉంటేనే కదా? సమస్యలు తగ్గేది. మరోవైపు పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ నేడు ప్రభుత్వాలు తాత్సారం వీడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. ఈ సమస్యలు మళ్లీ అపరిష్కృతంగా మిగిలిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వం డిఏలు, పెండింగ్ బిల్లుల విడుదలపై నిర్ణయం తీసుకోవాలి? తీసుకోవాల్సిన అవసరం, బాధ్యత వారిపై ఉంది. ఎన్నికల కోడ్ వస్తే ఫలితాలు వచ్చే దాకా డీఏ, పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూడాల్సి ఉంటుంది. ఈ లోపు డీఏలు ప్రకటించాలి. ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వాలు కాల యాపన చేస్తున్నాయి. అంతేకాకుండా సిపిఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నారు. అంతేకాకుండా సిపిఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యవస్థకు గుదిబండగా మారిన నేపథ్యంలో ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దాన్ని కూడా పరిష్కరించాల్సి ఉంది. ఆరునెలల్లో పిఆర్సీ సిఫారసులు అమలు చేస్తామన్న హామీలు కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. ఇలా ఎన్నికల షెడ్యూలు ముంచుకొస్తున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. కావున ప్రభుత్వం వెంటనే డిఏల విడుదల కోసం ప్రకటన జారీ చేయాలి. పెండింగ్ బిల్లుల విడుదల చేయాలి. సిపిఎస్ రద్దు చేస్తామన్న మాట నిలబెట్టుకోవాలి. ప్రభుత్వాల, ప్రజల సమస్యల పరిష్కారానికి గుండెకాయలాంటి ఉద్యోగుల పాలన వ్యవస్థకు సమస్యలు వస్తే ఆ సమాజం కూడా సమస్యల్లో ఉండిపోతుందనే సామాజిక స్పృహతో ప్రభుత్వ విధానాల అమలులో, పాలనలో వేగం, పారదర్శకత అందించి ప్రభుత్వాలకు పేరు ప్రతిష్టలు తెచ్చే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ●

# గత ఐదేళ్లలో 22,217 ఎన్నికల బాండ్ల జారీ




## సుప్రీంకు ఎస్‌బిఐ అఫిడవిట్

**న్యూఢిల్లీ, మార్చి 13:** రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చిన ఎన్నికల బాండ్ల వివరాలను భారతీయ స్టేట్ బ్యాంకు బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ డేటాను ఎస్‌బిఐ మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి అందచేసిన విషయం విదితమే. తాజాగా దీనిపై బ్యాంకు సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్ సమర్పించింది. ఏప్రిల్ 1, 2019 నుంచి ఈ యేడాది ఫిబ్రవరి 15 వరకు మొత్తంగా 22,217 ఎన్నికల బాండ్లను జారీచేసినట్లు వెల్లడించింది. 'కోర్టు ఆదేశాల మేరకు గత ఐదేళ్లలో మేం జారీ చేసిన ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను మార్చి 12న ఇసికి ఇచ్చాం. ఈ బాండ్లను ఎవరెవరు ఎంత కొనుగోలు చేశారు? ఏ పార్టీలు ఎంత ఎన్‌క్యాష్ చేసుకున్నాయి? వంటి వాటిని అందించాం' అని ఎస్‌బిఐ చైర్మన్ దినేశ్ కుమార్ అఫిడవిట్ సమర్పించారు. గత నెల ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం విదితమే. 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15, 2024 వరకు మొత్తం 22,217 ఎన్నికల బాండ్లను దాతలు కొనుగోలుచేసినట్లు ఎస్‌బిఐ తమ అఫిడవిట్‌లో పేర్కొంది. ఇందులో 22,030 బాండ్లను పలు రాజకీయ పార్టీలు ఎన్‌క్యాష్ చేసుకుని నిధులు తీసుకున్నట్లు తెలిపింది. మిగతా 187 బాండ్లను నిబంధనల ప్రకారం రిడీమ్ చేసి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధిలో డబ్బు జమ చేసినట్లు వెల్లడించింది. అయితే వీటితో ఏ పార్టీకి ఎన్ని నిధులు దక్కాయన్నదానిపై ప్రస్తుతానికి పూర్తి స్పష్టత లేదు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం, ఈ నెల 15 సాయంత్రం 5 గంటల్లోగా ఇసి ఈ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో బహిరంగపరచాల్సి ఉంది.

కేంద్ర ప్రభుత్వం 2019లో ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకొచ్చినప్పటి నుంచి ఈ యేడాది ఫిబ్రవరి వరకు 30 విడతల్లో ఎస్‌బిఐ వీటిని విక్రయించింది. వ్యక్తులు/సంస్థలు వీటిని కొనుగోలు చేసి అర్హత కలిగిన రాజకీయ పార్టీలకు నిధుల కింద అందించాయి. నిబంధనల ప్రకారం, జారీ అయిన తేదీ నుంచి 15 రోజుల వరకే ఇవి చెల్లుబాటవుతాయి. ఆలోగా రాజకీయ పార్టీలు వాటిని ఎన్‌క్యాష్ చేసుకోవాలి. గడువు ముగిసిన తర్వాత మిగిలిపోయిన బాండ్లకు చెందిన నగదును పిఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేస్తారు.



## విశ్వాసపరీక్షలో నెగ్గిన హర్యానా కొత్త సిఎం సైనీ

**ఛండీఘర్, మార్చి 13:** హర్యానా కొత్తముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ అసెంబ్లీలో నిర్వహించిన విశ్వాస పరీక్షలో నెగ్గారు. బిజెపి, దుష్యంత్ చౌతాలా జెజెపి పార్టీల బ్రేకప్‌కారణంగా ఏర్పడిన కొత్తప్రభుత్వంలో సిఎంకు 48 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించింది. వాస్తవానికి మెజార్టీ మార్కు 46 అయినా 48 మంది మద్దతిచ్చారు. మనోహర్‌లాల్‌ఖట్టర్ ఆకస్మిక రాజీనామాతో కొత్త సిఎంఎంపిక, కొత్తప్రభుత్వం ఏర్పాటు అనివార్యం అయింది. బుధవారం జరిగిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో విశ్వాసపరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. విప్ జారీచేసిన ఎమ్మెల్యేలతోపాటు జెజెపికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు జోగిరామ్‌సిహాగ్, ఈశ్వర్‌సింగ్; రామ్‌కుమార్ గౌతమ్, దేవేంద్ర బబ్లిలు అసెంబ్లీకి వచ్చారు. ఆ తర్వాత నలుగురు జెజెపి ఎమ్మెల్యేలు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే బాల్‌రాజఖ్ కుందులు సభను వీడి వెళ్లిపోయారు. 90 మంది అసెంబ్లీలో బిజెపికి 41 మంది సభ్యులున్నారు. మొత్తం ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఆరుగురి మద్దతు లభించింది. హర్యానా లోక్‌హిత్ పార్టీ ఎమ్మెల్యే గోపాల్ కందా మద్దతును కూడా సాధించారు. జెజెపికి అసెంబ్లీలో పది మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి 30 మంది ఎమ్మెల్యేలున్నారు.

ఐఎన్ఎల్డీకి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ఉదయం పదిగంటలకే అసెంబ్లీప్రత్యేక సమావేశం ప్రారంభించారు. ఖట్టర్ ఇతర బిజెపి ఎమ్మెల్యేలు ఈ కీలక సమావేశానికి హాజరయ్యారు. మాజీ హోం మంత్రి ఆరుపర్యాయాలు ఎమ్మెల్యేగా నిలిచిన అంబాలా కంటోన్మెంట్ ఎమ్మెల్యే అనిల్‌విజ్‌కు కొత్త కేబినెట్‌లో బెర్త్ లభించలేదు. అంతే కాకుండా సిఎం సైనీ ప్రమాణస్వీకారానికి కూడా రాలేదు. 54 ఏళ్ల ఒబిసి నేత హర్యానా బిజెపి చీఫ్ సైనీచేత గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణంచేయించారు. రానున్నలోక్‌సభ ఎన్నికల్లో ఖట్టర్‌ను ఏదో ఒక నియోజకవర్గంనుంచి పోటీచేయిస్తారని తెలుస్తోంది. జెజెపి రాష్ట్రంలోని పది లోక్‌సభ స్థానాలు, 90 అసెంబ్లీ స్థానాలకు కూడా తమ పార్టీ పోటీచేస్తుందని ప్రకటించింది.

## ప్రముఖ నవలారచయిత అరుణ్‌గోస్వామి కన్నుమూత

**గువాహతి, మార్చి 13:** ప్రముఖ నవల, లఘుకథా రచయిత ఆరుణ్‌గోస్వామి(80) కన్ను మూసారు. సుదీర్ఘకాలంగా ఆయన అస్వస్థతతో బాధపడుతున్నారు. జోర్హాట్‌లోని మిషన్ ఆసుపత్రిలో చేర్చిన గోస్వామి చికిత్స పొందుతూనే కన్నుమూసినట్లు గోస్వామి కుటుంబ సభ్యులు తెలిపారు. అస్సాంలోని డేర్గాంవ్‌లో జన్మించిన గోస్వామి తన పొట్టికథలకు, నవలలకు ఎంతో ప్రాచుర్యం లభించింది. పదివేల పేజీలతో రచించిన పుస్తకానికి ఆయనకు ప్రపంచ రికార్డుకూడా లభించింది. ఆయన రచనలన్నీ కూడా సామాజిక బాధ్యతతో కూడుకుని ఉంటాయి. అస్సాంలో నెలకొన్న కల్లోలిత సమస్యపైనే ఆయన ఎక్కువ రచనలుచేసారు. ఆయన రచనల్లో కలక్షణ, శలాంతా బిబోరిని వంటివి మంచి గుర్తింపు పొందాయి. తన సాహితీ రచనలతోపాటు గోస్వామి రాజకీయ విశ్లేషకునిగా కూడా పేరుపొందారు. ఆయన చేసిన విశ్లేషణలకు రాజకీయనాయకులుసైతం విస్మయం వ్యక్తంచేసేవారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆయన చేసిన విశ్లేషణలు విస్తృత ప్రాచుర్యం పొందాయి.

## లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఖర్గే విముఖత

### వయసు మీదపడిందని వాఖ్య



**న్యూఢిల్లీ, మార్చి 13:** కాంగ్రెస్ పార్టీ సీనియర్లు ఒక్కొక్కరుగా ప్రత్యక్ష ఎన్నిలకు దూరమవుతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. పార్టీ అధినేత మల్లికార్జునఖర్గే సహా సీనియర్లు దిగ్విజయ్‌సింగ్, అశోక్‌గెహ్లాట్, హరీశ్‌రావత్, కమల్‌నాథ్, రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ వంటి సీనియర్ నేతలు లోకసభ ఎన్నికల్లో పోటీచేయవద్దని నిర్ణయించుకున్నట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే తాజాగా తోసిపుచ్చారు. మీతో సహా సీనియర్ నాయకులు లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటున్నారు కదా? అని ఖర్గేని మీడియా ప్రశ్నించింది. అందుకు ఖర్గే వయసు కారణంగా చెప్పారు. సీనియర్లు పోటీ నుంచి తప్పుకుంటున్నారన్న వార్తల్లో నిజం లేదని, తనవయసు ఇప్పుడు 83యేళ్లని, వయోభారం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అయితే కార్యకర్తలు కనుక పోటీచేయాల్సిందేనని పట్టుబడితే మాత్రం చెయ్యక తప్పదని పేర్కొన్నారు. ఇప్పుడు నా వయసు 83 యేళ్లు. మీరు 65 యేళ్లకే రిటైర్ అవుతారు. అలాగే నేను 83 యేళ్ల వయసులో ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఒకవేళ ఈసారి ఎన్నికల్లో దిగితే సొంత నియోజకవర్గం గుల్బర్గా నుంచి పోటీ చేస్తారా? అని మీడియా ప్రశ్నించగా అధిష్టానం ఆదేశిస్తే తప్పకుండా అని బదులిచ్చారు. పార్టీ కార్యకర్తలు ఒత్తిడి చేస్తే మాత్రం బరిలోకి దిగక తప్పరు. కొన్నిసార్లు పార్టీని ముందుండి నడిపిస్తే, మరికొన్నిసార్లు వెనుక నుండి నడిపించాల్సి ఉంటుంది. తమకు అందిన జాబితాలో ఒకేస్థానం నుంచి పోటీకి పదేసిమంది రెడీగా ఉన్నారు. అని ఖర్గే అన్నారు. కాగా, ఖర్గే 2009, 2014 లోక్‌సభ ఎన్నికల్లో గుల్బర్గా నుంచి ఎంపిగా పోటీకి దిగు గెలుపొందిన విషయం తెలిసిందే. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో మాత్రం ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లోసోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలను సంప్రదించిన తర్వాతే ఎన్నికల్లో పోటీచేయాలా వద్దా అనే అంశంపై ఖర్గే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## సిఎఎతో భారత్‌లోకి వలసలు పెరుగుతాయి



### ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, మార్చి 13:** పౌరసత్వ సవరణ చట్టం అమలుపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎన్నికలకు ముందు ఓటు బ్యాంకు రాజకీయాలే లక్ష్యంగా కేంద్రం సిఎఎను అమల్లోకి తెచ్చిందని విమర్శించారు. ఇదో మురికి ఓటు బ్యాంకు రాజకీయ. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వలసదారులకు పౌరసత్వం ఇచ్చిన వారికి బిజెపి బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో ఆశ్రయం కల్పిస్తుంది. దీనివల్ల భవిష్యత్‌లో బిజెపికి ఓటు బ్యాంకు పెరుగుతుంది. వారిరాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. ఇప్పటికే దేశంలో ఉన్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం సిఎఎగురించి మాట్లాడుతోంది. 2014కు ముందు భారత్‌కు వచ్చిన వారికి పౌరసత్వం ఇస్తామంటున్నారు. కాని ఒకసారి తలుపులు తెరిచిన తరువాత మిగిలిన వారు ఊరుకుంటారా, పెద్ద సంఖ్యలో వలసదారులు భారత్‌లోకి రావడం ప్రారంభిస్తారు. మూడు దేశాల్లో 30 మిలియన్లకు పైగా మైనారిటీలు నివసిస్తున్నారు. 15 మిలియన్ల మంది భారత్‌కు వచ్చినా వారు ఎక్కడ స్థిరపడతారు. వారికి ఉద్యోగాలు ఎవరు ఇస్తారు. ఇది దేశానికి ప్రమాదకరం. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు ప్రభావితం అయ్యే అవకాశముందన్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులు రావడం వల్ల అస్సాం ప్రజల భాష, సంస్కృతి ఇబ్బందుల్లో పడ్డాయని, ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వలసదారులకు పౌరసత్వం ఇవ్వడం వల్ల దేశంలోని యువతకు అందాల్సిన ఉద్యోగావకాశాలు వారికి దక్కుతాయి. వారికి ఉద్యోగాలు ఇస్తారు. ఇళ్లు కట్టిస్తారు. మరి మన దేశ పౌరుల పరిస్థితేంటి అని కేజ్రీవాల్ కేంద్రాన్ని ప్రశ్నించారు. పాకిస్థానీయులను మన దేశంలో స్థిరపరచడానికి బిజెపి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. మనదేశ అభివృద్ధికి ఉపయోగించాల్సిన ప్రభుత్వ డబ్బును కేంద్రం పాకిస్థానీయుల స్థిరీకరణకు ఖర్చు చేయాల్సి వస్తుందని విమర్శించారు.




## బెంగళూరు బాంబు పేలుడు కేసులో కీలక వ్యక్తి అరెస్టు

**బెంగళూరు, మార్చి 13:** రామేశ్వరం కెఫే బాంబు పేలుడు కేసులో కీలక వ్యక్తిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అరెస్టు చేసింది. బుధవారం కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో కస్టడీలోకి తీసుకున్నట్లు ఎన్ఐఎ అధికారి తెలిపారు. నిందితుణ్ని షబ్బీర్‌గా గుర్తించారు. ప్రస్తుతం రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ అరెస్టుపై ఎన్ఐఎ అధికారిక ప్రకటన చేయలేదు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తికి ఇతను సహరించినట్లు తెలిసింది. ఈ నెల ఒకటో తేదీన బెంగళూరులోని బ్రూక్‌ఫీల్డ్‌లో ఉన్న రామేశ్వరం కెఫేలో బాంబు పేలిన ఘటనలో 9 మంది గాయపడ్డారు. ఈ కేసులో కర్ణాటక హోంశాఖ ఎన్ఐఎకు అప్పగించింది. సిసిటివి ఫుటేజీ ఆధారంగా నిందితుడి చిత్రాలను విడుదల చేశారు. అతడి ఆచూకీ చెప్పిన వారికి రూ.10లక్షల నగదు రివార్డును ఎన్ఐఎ ప్రకటించింది. ఈ కేసులో నిందితుడు ఆర్‌డిఎక్స్ ఉపయోగించాడని నిపుణులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ క్రమంలోనే తొలి అరెస్టుచేశారు.

## ఇసిల నియామకాలపై 15న సుప్రీం అత్యవసర విచారణ



**ఢిల్లీ, మార్చి 13:** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిఇసి, ఇసిల నియామకాల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్ల నియామకాల కోసం కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్ల అత్యవసర విచారణ చేపట్టాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) తాజాగా అభ్యర్థించింది. ఇందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, శుక్రవారం విచారణ జరుపుతామని వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీ అయిన కమిషనర్ల పోస్టులను ఈ నెల 15వ తేదీలోగా భర్తీ చేసేందుకు కేంద్రం సిద్ధమవుతున్న వేళ, ఈ పరిణామం చోటు చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెల ఒక కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. ఇటీవల మరో కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. ఈ క్రమంలోనే ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది.

ప్రధాని మోడీ, కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ ఛౌదరి, కేంద్రమంత్రి సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ మార్చి 15లోగా కొత్త కమిషనర్ల పేర్లను ఖరారు చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజా నియామకాలను సవాల్ చేస్తూ ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన ఓ నేత సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని కూడా శుక్రవారం విచారించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషనర్ల నియామకాలపై పార్లమెంటులో చట్టం చేసేవరకు ప్రధానమంత్రి నేతృత్వంలో లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికిసిలి సిఇసి, ఇసి నియామకాలు చేపట్టాలని 2023 మార్చిలో అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకం, వారి సర్వీసు నిబంధనలకు సంబంధించి గతేడాది డిసెంబరులో కేంద్రం కొత్త చట్టం అమల్లోకి తెచ్చింది. దాని ప్రకారం, ఇసిల నియామక బాధ్యలను సెర్చ్, ఎంపిక కమిటీలు నిర్వహించనున్నాయి. ఎంపిక కమిటీలో సిజెఐ స్థానంలో ప్రధాని సూచించిన కేంద్రమంత్రిని చేర్చింది. దీన్ని సవాల్ చేస్తూనే సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

## అణు యుద్ధానికి సిద్ధం: పుతిన్



**మాస్కో, మార్చి 13:** అమెరికా సైన్యాన్ని పంపితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. యుద్ధం మరింత పెరుగుతుందని చెప్పారు. బుధవారం రష్యాలో ఓ టెలివిజన్ ఛానల్‌కు పుతిన్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా రష్యా అణు యుద్ధానికి సిద్ధంగా ఉందా అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, అణుయుద్ధానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నామని, కానీ ఆ ప్రయోగానికి ఇప్పుడు తొందరేం లేదన్నారు. రష్యా సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీయాలని చూస్తే మాత్రం కచ్చితంగా వాటిని ప్రయోగిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఉక్రెయిన్‌లో యుఎస్ దళాలను మోహరిస్తే ఏం జరుగుతుందో అమెరికాకు ఇప్పటికే అర్థమైందని తెలిపారు. అణు యుద్ధం చేయడంలో ఇబ్బందేం లేదని, అయితే ఉక్రెయిన్‌లో వాటిని ఉపయోగించాల్సిన అవసరం ఏమీ లేదని స్పష్టం చేశారు. రష్యా ప్రజలు తనకు మరో ఆరేళ్ల అధికారం ఇవ్వడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. 'రష్యా-అమెరికా సంబంధాలలో అనేకమంది నిపుణులు ఉన్నారు. కాబట్టి అణు ఘర్షణ పరిస్థితులు తలెత్తుతాయని భావించట్లేదు. కానీ అనుకోని పరిస్థితులు ఎదురైతే మాత్రం వెనుకడుగు వేయబోము'అని పుతిన్‌తెలిపారు. ఉక్రె యిన్‌లో పోరాడటానికి దళాలను పంపితే పశ్చిమ దేశాలు అణు యుద్ధాన్ని రెచ్చగొట్టే ప్రమాదం ఉందని పుతిన్ గతంలోనూ హెచ్చరించారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి తమ ప్రభుత్వం ఎవరినీ అనుమతించదన్నారు.

## విశ్వాసపరీక్షలో నెగ్గిన నేపాల్‌ప్రధాని పుష్పకమల్

**ఖాట్మండు, మార్చి 13:** నేపాల్‌ప్రధాన మంత్రి పుష్పకమల్‌ధహల్ పార్లమెంటులో నిర్వహించిన విశ్వాసపరీక్షలో విజయం సాధించారు. మూడోసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వారం రోజుల తర్వాత పార్లమెంటులో నిర్వహించిన విశ్వాసపరీక్షలు ఆయన నెగ్గారు. లిబరల్ కమ్యూనిస్టుల ఆధిపత్యంతో మరోసారి ధమాల్‌ప్రభుత్వం కొనసాగిస్తున్నారు. మాజీ మావోయిస్టు గెరిల్లా నాయకుడు అయిన దహల్ చైనా,భారత్‌లమధ్య ఉన్న హిమాలయ దేశంలో ప్రముఖంగా పేరుపొందారు. నేపాలి కాంగ్రెస్ పార్టీ మరికొన్ని చిన్న పార్టీలతోకలిసి ఆయన గత ఏడాది సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేసారు. అయితే కూటమిలో తనకు స్వేచ్ఛ ఇవ్వడంలేదని ఆయన మిత్రపక్షాలను కూడా మార్చేసారు. కొత్తకేబినెట్‌లో లిబరల్ నేపాల్ కమ్యూనిస్టు పార్టీతోపాటు మరికొన్ని చిన్నగ్రూప్‌లు వచ్చాయి. 2022 ఎన్నికల తర్వాత యుఎంఎల్‌పార్టీతో కలిసి సంకీర్ణప్రభుత్వం కూడా దహల్ నడిపారు. 275మంది సభ్యులున్న పార్లమెంటులో 110 మంది దహల్‌కు వ్యతిరేకంగా ఓటువేసారు. 157 మంది దహల్‌కు మద్దతుపలికారు. మెజార్టీ 138 మార్కుకంటే దహల్‌కు ఎక్కువ ఓట్లు రావడంతో స్పీకర్ దేవ్‌రాజ్ ఘిమిరే పుష్పకమాల్ దహల్ నెగ్గినట్లు ప్రకటించారు. 2006లో జరిగిన శాంతి ఒప్పందానికి ముందు 1996 నుంచి కూడా దహల్ నేపాల్‌లో కల్లోలానికి కారకుడని మావోయిస్టు గెరిల్లా నేతగా పేరుపడ్డారు. ఈ కల్లోలంలోనే 17వేలమందికి పైగా మరణించారు. ఆ తర్వాత ఐక్యరాజ్య సమితి శాంతి ఒప్పందం చేసిన తర్వాత జనజీవన స్రవంతిలోకి దహల్ వచ్చారు. వరుసగా మూడోసారి ఆయన ప్రధానిగా వచ్చారు.

అయితే ఎప్పుడూ కూడా ఆయన ఐదేళ్లు పూర్తికాలం కొనసాగలేదు. 2008లో నేపాల్ రాజరికవ్యవస్థ రద్దయిన తర్వాత ఇప్పటివరకూ 13 ప్రభుత్వాలు ఏర్పాడ్డాయి. 40 బిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ ఉన్న నేపాల్‌లో ఆర్థిక అస్థిరత కారణంగా అనేకమంది నేపాల్ యువత మధ్యప్రాచ్యం, దక్షిణకొరియా, మలేసియా దేశాలకు వలసపోతున్నారు.

## ఢిల్లీ హైకోర్టులో కాంగ్రెస్‌కు షాక్

### ఐటినోటీస్‌పై స్టేకు నిరాకరణ

**న్యూఢిల్లీ, మార్చి 13:** కాంగ్రెస్ పార్టీ పన్ను బకాయిలు 100 కోట్లు వసూలుచేసేందుకు ఆదాయపు పన్నుశాఖ జారీచేసిన నోటీస్‌పై స్టే ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. జస్టిస్ యశ్వంత్‌వర్మ, పురుషేంద్రకుమార్ కౌరవ్‌లతో కూడిన బెంచ్ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉత్త ర్వుల్లో జోక్యంచేసుకునేందుకు ఎలాంటి కారణం కనిపించడంలేదని చెప్పింది. కాంగ్రెస్ పార్టీ ఐటాట్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిం చిన సంగతి తెలిసిందే. గతనెల 13వ తేదీ ఐటిశాఖ ఇచ్చిన నోటీసుపై స్టే మంజూరుచేయా లనికోరింది. ఐటిఅసెస్‌మెంట్ అధికారి రూ.100కోట్ల ట్యాక్స్ డిమాండ్ నోటీస్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరపున వాదించిన కౌన్సెల్ తనవాదనల్లో పార్టీకి ఈసమయంలో ఇలాంటి ఉత్తర్వులు కొంత నష్టంచేస్తాయని,అందువల్ల తాత్కాలిక స్టేమంజూరు చేయాలని కోరారు. ఐటిశాఖ కౌన్సెల్ తన వాదనల్లో వాస్తవ డిమాండ్ 102 కోట్లుగా ఉందని, వడ్డీతో కలిపితే 135.06 కోట్లు వరకూ ఉందని, ఇప్పటివరకూ 65.94 కోట్లు రికవరీ అయిందని తెలిపారు. ఈపరిస్థితుల్లో ఐటిశాఖ జారీచేసిన నోటీసులపై జోక్యం అవసరమని భావించడం లేదని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

## హిందూ మహా సముద్రంలో నౌక హైజాక్..

**ఢాకా, మార్చి 13:** హిందూ మహాసముద్రంలో సముద్రపు దొంగలు మళ్లీ రెచ్చిపోయారు. బంగ్లాదేశ్ జెండాతో ఉన్న ఓ కార్గో నౌకను హైజాక్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగినట్లు నౌక యాజమాన్యం బుధవారం వెల్లడించింది. బంగ్లాదేశ్‌లోని కబీర్ స్టీల్ అండ్ రీరోలింగ్ మిల్ గ్రూప్‌నకు చెందిన 'అబ్దుల్లా' అనే కార్గో నౌక మొజాంబిక్ దేశం నుంచి బొగ్గు తీసుకుని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు బయల్దేరింది. ఈ నౌక మంగళవారం హిందూ మహా సముద్రంలో ప్రయాణిస్తుండగా సముద్రపు దొంగలు అందులోకి చొరబడ్డారు. ఆయుధాలతో సిబ్బందిని బెదిరించి నౌకను తమ నియంత్రణలోకి తీసుకున్నారు.అందులో 23 మంది సిబ్బంది ఉన్నారని, వారిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దుండగులు నౌకను తమ అధీనంలోకి తీసుకున్నారని, అయితే సిబ్బంది మాత్రం సురక్షితంగానే ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం దాన్ని సోమాలియా తీరం దిశగా తీసుకెళ్తున్నట్లు తమకు సమాచారం అందిందని వెల్లడించింది. బంగ్లాదేశ్ చరిత్రలో తమ ఓడలు హైజాక్‌కు గురవడం ఇది రెండోసారి. 2010లో ఇలాగే ఓ నౌకను అరేబియా సముద్రంలో సముద్రపు దొంగలు అడ్డగించి తమ అధీనంలోకి తీసుకున్నారు. అందులోకి 25 మంది సిబ్బందిని బందీలుగా చేసుకుని దాదాపు 100 రోజుల తర్వాత విడిచిపెట్టారు. తాజా ఘటన ఎవరు చేశారన్నది ఇంకా తెలియరాలేదు.

## ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం!




**న్యూఢిల్లీ,మార్చి 13:** ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఫిబ్రవరి7న ఆమోదించి ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారం ఆమోద ముద్ర వేశారు.దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. మతంతో సంబంధం లేకుండా వివాహాలు, విడాకులు, భూములు,ఆస్తులు, వారసత్వ చట్టాలు అందరికీ ఒకే రీతిలో వర్తించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ థామి గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, బిల్లు సభామోదం పొందింది. వివాహాలు, విడాకులు, వారసత్వం, లివ్-ఇన్ రిలేషన్ షిప్, సంబంధిత అంశాలకు ఉద్దేశించి ఈ చట్టం రూపొందింది. యూసీసీ ప్రకారం సహజీవనం సాగించడాన్ని కూడా రిజిస్టర్ చేయించుకోవాలి. బాల్యవివాహాలపై సంపూర్ణ నిషేధం ఉంటుంది. విడాకులకు సంబంధించి యూనిఫాం విధానం అమల్లోకి వస్తుంది. అన్నిమతాల్లోని మహిళలకు ఆస్తిలో సమాన హక్కులను ఈ చట్టం కల్పిస్తుంది. యూసిసీ చట్టం ప్రకారం యువతుల వివాహాల రిజిస్టేషన్ అన్నిమతాల వారికి తప్పనిసరి. రిజిస్టేషన్ జరగకుంటే ఆ వివాహం చెల్లదు. ఏడాది తర్వాత మాత్రమే పిటిషన్లను అనుమతిస్తారు.

## కెనడాలో మళ్లీ రెచ్చిపోయిన ఖలిస్థానీ మద్దతుదారులు

### నిజ్జర్ హత్యలో భారత్ పాత్ర ఉందని ఆరోపణలు

**ఒట్టావా, మార్చి 13:** కెనడాలో మళ్లీ ఖలిస్థానీ మద్దతుదారులు రెచ్చిపోతున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడ ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక గతేడాది కెనడాలో హత్యకు గురైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ విషయంలో భారత్‌పై ఆరోపణలు రావడం, ఖలిస్థానీ మద్దతుదారుల నిరసనలు మరింత పెరిగాయి. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ ఏజెంట్ల పాత్ర ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వివాదాస్పదవ్యాఖ్యలు, రెండు దేశాల మధ్య ఉన్న సత్సంబంధాలను దెబ్బతీశాయి. అప్పటి నుంచి ఖలిస్థాన్ మద్దతుదారులు భారత్‌పట్ల, భారత రాజకీయ నేతలు లక్ష్యంగా తీవ్ర బెదిరింపులకు దిగిన ఘటనలు ఉన్నాయి. కెనడా అల్బెర్టాలోని ఎడ్మోంటన్ ప్రాంతంలో భారీగా ఖలిస్థానీ మద్దతుదారులు చేరుకుని తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు. కత్తులు, ఈటెలు, ఇతర మారణాయుధాలు తీసుకువచ్చి తీవ్ర కలకలం రేపారు. ఈ క్రమంలోనే ఖలిస్తానీ మద్దతుదారులను అడ్డుకునేందుకు, వారిని చెదరగొట్టేందుకు ఎడ్మోంటన్ పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. ఇక భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ వాహనం వైపు దూసుకెళ్లెందుకు ప్రయత్నించిన ఖలిస్తానీ మద్దతుదారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉందని కెనడా ప్రధాని చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ అబద్ధాలని ఇప్పటికే చాలాసార్లు స్పష్టం చేసింది. ఖలిస్తాన్ ఉగ్రవాది అయిన హర్దీప్‌సింగ్ నిజ్జర్‌ను కెనడాలోని ఓ గురుద్వారా వద్ద గత యేడాది జూన్ 18న గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. హర్దీప్‌సింగ్ నిజ్జర్‌ను భారత్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా అంతకుముందు ప్రకటించింది.

## అరుణాచల్ 60 స్థానాలకు బిజెపి అభ్యర్థులు వెల్లడి

**ఇటానగర్, మార్చి 13:** లోక్‌సభ ఎన్నికలతోపాటే అసెంబ్లీకి సైతం ఎన్నికలు జరగనున్న అరుణాచల్‌ప్రదేశ్‌లో బిజెపిహైకమాండ్ మొత్తం 60స్థానాలకు అభ్యర్థులనుప్రకటించింది. ముఖ్యమంత్రి పెమాఖండూ ముక్తోస్థానంనుంచి పోటీచేస్తున్నట్లుప్రకటించారు. అరుణాచల్ బిజెపి చీఫ్ బియూరమ్ వాఘే కూడా పక్కేకెస్సంగ్ ఎస్టీ స్థానంనుంచి పోటీచేస్తుంటే డిప్యూటి సిఎం చౌనా మైయిన్ చౌకన్‌ఎస్టీస్థానంనుంచి పోటీచేస్తున్నారు. కొత్తగావచ్చిన రాటు టెచ్చి సగాలీ స్థానం నుంచి పోటీచేస్తారు. ప్రస్తుతం ఈస్థానంనుంచి మాజీ సిఎం నబామ్ టుకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని మొత్తం 60 స్థానాల అభ్యర్థులను ఆమోదించింది. పట్టణాభివృద్ధిమంత్రి కమ్లున్ మోస్సాంగ్ ఎస్టీ మియవో స్థానంనుంచి గ్రామీణ పనులు, సైన్స్ టెక్నాలజీ మంత్రి హోంచున్ ఎంగందంను ఎస్టీస్థానం పోంగ్చావో వాక్కాస్థానం, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్; సాగునీటిసరఫరా మంత్రి వాంగకీ లతోవాంగ్‌ను ఎస్టీస్థానం నామ్‌సాంగ్ నుంచి పోటీకి ఎంపికచేసారు.

## భాష్యం స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**కొత్తపేట మార్చి 13 (ప్రభాతవార్త)**




కొత్తపేట భాష్యం స్కూల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం. లోకేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న పై తరగతులకు వెళ్తున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ దుస్తులు వేసి పట్టాలు అందజేసారు. భవిష్యత్తులో చదువుతో పాటు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ప్రిన్సిపాల్ ఎన్. రమాజ్యోతి, షిర్డీ సాయి, జయ, చైతన్య, ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## సర్కార్ ఎక్స్ ప్రెస్ ను జండా ఊపి ప్రారంభించిన... సత్తిబాబు

**యానం మార్చి 13, ప్రభాతవార్త:**

యానాం నియోజకవర్గం యానాం కాకినాడ నుండి సర్కార్ ఎక్స్ప్రెస్ పుదుచ్చేరి వరకు పొడిగించాలని ఎంపీ వైద్య లింగం పార్లమెంట్ లో సమస్యను లేవనెత్తడంతో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కాకినాడ నుండి పుదుచ్చేరి వరకు సర్కార్ ఎక్స్ప్రెస్ పొడిగించారు. ఈ సందర్భంగా బుధవారం కాకినాడ నుండి పుదుచ్చేరి బయలుదేరుతున్న సర్కార్ ఎక్స్ప్రెస్ని యానం కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ ఇంచార్జ్ మల్లాడి సత్యనారాయణ (సత్తిబాబు) కాకినాడ రైల్వే స్టేషన్ లో జెండా ఊపి ప్రారంభించారు. యానం ప్రజల చిరకాల కోరికను నెరవేర్చినందుకు ఎంపీ వైద్య లింగంకి యానం కాంగ్రెస్ పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఇంచార్జ్ రమేష్ కుమార్, కాకినాడ కాంగ్రెస్ నాయకులు పిల్లి చిన్న, పోలిశెట్టి శ్రీనివాసు, రూరల్ మండలం ఇంచార్జ్ మూర్తి, పబ్బిడి కృష్ణ, లంక బంగారం, దున్న చక్రవర్తి, ప్రసాద్ యాదవ్, చౌదరి, మున్నా, గణేష్, తదితర నాయకులుపాల్గొన్నారు.



## రాజమండ్రి రూరల్ మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న.. మంత్రి వేణుగోపాలకృష్ణ

**ఉమ్మడితూర్పుగోదావరిజిల్లా బ్యూరో**

**మార్చి 13, ప్రభాతవార్త**




పాలనా సంస్కరణలో భాగంగా ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వచ్చి అన్ని పౌర సేవలను అందించేందుకు సచివాలయ వ్యవస్థను సీయం వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసారని జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం రాజమండ్రి రూరల్ మండలం ధవళేశ్వరం, శాటిలైటి సిటీ గ్రామాల్లో మంత్రి వేణుగోపాలకృష్ణ స్థానిక నాయకులు, అధికారులతో కలసి రు. 2.03 కోట్లతో 3 గ్రామ సచివాలయాలను, 4 వై ఎస్ ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలకు ప్రారంభోత్సం, రూ. 1.14 కోట్లతో నిర్మించనున్న అంతర్గత రహదారులు, సీసీ డ్రైన్ల పనులను ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి వేణ గోపాల కృష్ణ మాట్లాడుతూ సీయం వైఎస్. జగన్మోన్ రెడ్డి గ్రామాల్లోనే ప్రభుత్వం సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలనే ధృకృధంతో సచివాలయ వ్యవస్థను స్థాపించారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు వారి గ్రామాల్లోనే అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనం, పౌర సేవలను సత్వరమే అందించడం జరగుతుందన్నారు. ప్రజారోగ్యానికి భద్రతను కల్పించే దిశగ ప్రభుత్వం పనిచేస్తూ ప్రతి గ్రామంలోను వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ఆరోగ్య శ్రీ ద్వారా కార్పోరేట్ వైద్యాన్ని అందించేందుకు రూ. 25 లక్షలకు పెంచిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టరు కాన్సప్ట విదానాన్ని ప్రవేశ పెట్టి ప్రజారోగ్యం పై ప్రభుత్వం ప్రత్యేక ధృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి గ్రామ కాలుష్య రహితంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాలుష్య నివారణ కొరకు ప్రతి గ్రామంలో డ్రైన్లు, అంతర్గత సీసీ రహదారుల నిర్మాణ పనులను ప్రారంబించుకుని వేగవంతం చేస్తున్నామన్నారు. ధవళేశ్వరం గ్రామ లో సచివాలయం -3, 4,5 భవనాలను ఒక్కోక్కటి రూ. 40 లక్షలరూపాయలతో నిర్మించడం జరిగిందని, అదేవిధంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ - 2,3,4,5 భవనాలను ఒక్కోక్కటి రూ. 20.80 లక్షల రూపాయలతో నిర్మించిన భవనాలను నేడు ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. అదే విదంగా యంజీ ఎన్ ఆర్ ఈ జిఎస్ నిధులతో ధవళేశ్వరంలో రూ. 74 లక్షలతో, శాటిలైట్ సిటీ గ్రామంలో రూ. 40 పలు అంతర్గత సీసీ రహదారులు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులను ప్రారంబించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట యంపిడీవో డి. శ్రీనివాసరావు, పిఆర్ ఏఈ సంపత్ కుమార్, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, స్థానిక నాయకులు నక్కా రాజబాబు, తలారి వరప్రసాద్, గునిపే అశోక్, మిరప రమేష్, షట్టర్ భాష, ఒంటెద్దు కృష్ణ, హమీద్ భాష, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'సూపర్ సిక్స్' పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలి..

### క్లస్టర్-9 ఇంచార్జ్ దాసరి..

**అంబాజీపేట, మార్చి 13, ప్రభాతవార్త..**

టిడిపి మినీ మేనిఫెస్టో 'సూపర్ సిక్స్'పథకాలను క్లస్టర్ పరిధిలోని ఇంటింటికి తీసుకు వెళ్ళి,రాబోయే టిడిపి,జనసేన, బిజెపిల ఉమ్మడి ప్రభుత్వంలో ప్రజలకు అందే ప్రయోజనాలను వివరించాలని క్లస్టర్-9 ఇన్చార్జి దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. మండలంలోని పుల్లేటికుర్రులో దాసరి స్వగృహం వద్ద క్లస్టర్-9 సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సూపర్ సిక్స్ శంఖారావం కార్యక్రమంను క్లస్టర్ పరిధిలో ఇంటింటికి తెలియజేయాలన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టేలా సహకరించాలని ప్రజలను కోరాలన్నారు.ఇంటింటికి కరపత్రాలను పంచి పెట్టాలని యూనిట్ ఇంచార్జ్ లకు, బూత్ కమిటీ కన్వీనర్లకు, గ్రామ కమిటీలకు తెలిపారు. అభివృద్ధిని దూరం చేసి, ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని, వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు నాయకులు,కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, రానున్న 45 రోజులు చాలా కీలకమని క్లస్టర్ ఇంచార్జ్ దాసరి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు పబ్బినిడి రాంబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి పెదపూడి శ్రీనివాస్, యూనిట్ ఇంచార్జి దాసరి శ్రీనివాసరావు, వాస%శీ%శెట్టి శ్రీనివాసరావు, సుంకర గణపతి రావు, దొమ్మేటి సురేష్ కుమార్ మానేపల్లి శ్రీనివాసరావు, నేదునూరి వెంకటరమణబాబు, దొమ్మేటి ప్రభాకరరావు, పెచ్చెట్టి హరిబాబు, కటకం వీరభద్రరావు, ఉప్పలగుప్తం సురేష్, రంకిరెడ్డి అబ్బు, నేదునూరి బాబులు, చిట్టూరి హరికృష్ణ, గుత్తుల నాగరాజు, పెట్టా వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు



## రాష్ట్ర అభివృద్ధి కి టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావాలి

### ప్రతిపక్ష నేత రామకృష్ణుడు

### చిన్నయ్యపాలెం లో భారీగా పార్టీలో చేరికలు

**తొండంగి/ శంకవరం మార్చి 13 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలంటే తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. తొండంగి మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు అధ్యక్షతన పీఇ

చిన్నయ్య పాలెంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ఉమ్మడి అభ్యర్థిని యనమల దివ్య, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు హాజరైయ్యారు.అనంతరంజరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి రాంబాబు, పిఎసిఎస్ త్రిమెన్ కమిటి సభ్యులు వడ్డి నాగేశ్వరరావు, పి ఈ చిన్నయ్య పాలెం మాజీ సర్పంచ్ ములికి రామకృష్ణ వారి అనుచరులతో కలిసి యనమల రామకృష్ణుడు,సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.వీరికి పసుపు కండువాలు కప్పి యనమల రామకృష్ణుడు, యనమల దివ్య, యనమల కృష్ణుడు తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.ఈసంధర్భంగా రామకృష్ణుడుమాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని, మహిళల ఆర్థిక స్వాలంబనకు మహా శక్తి దోహదపడతాయని రాష్ట్ర అభివృద్ధికి టిడిపి జనసేన గెలిపించాలని ఆయన కోరారు.కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇచ్చి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.ఈకార్యక్రమంలో జనసేన సమన్వయకర్త చోడిశెట్టి గణేష్,మండల జనసేన అధ్యక్షుడు సోమిశెట్టి నాయుడు,జనసేన నాయకులు పలివెల లోవరాజు, వంగలపూడి నాగేంద్ర,టీడీపీ నాయకులు కోడారమణ,పేకేటి హరిబాబు,సిద్దా రాంబాబు, దూలంమాణిక్యం, బంటుపల్లి అన్వేష్, చొక్కా కాశీ,ముసలయ్యపేట సర్పంచ్ తాటిపర్తి శ్రీను, తొండంగి సర్పంచ్ సోమాల ప్రసాద్,చిన్నయ్య పాలెం సీనియర్ టీడీపీ నాయకులు తంగెళ్ల శ్రీను,ములికి రాంబాబు,నరపరశెట్టి ప్రకాష్, తోట గోవిందు, బోలెం త్రిమూర్తులు, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.




## తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ' 585వ జయంతి..

**అంబాజీపేట,మార్చి 13, ప్రభాతవార్త..**

తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ 585వ జయంతిని మాచవరంలోని కుమ్మరి, శాలివాన సంక్షేమ సంఘ భవనం వద్ద, అంబాజీపేట శివారు కుమ్మరిపాలెంలో శ్రీ సీతారామ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మాచవరంలోని కోనసీమ కుమ్మరిశాలివాహన సంఘ భవనం ఆవరణలో ఉన్న కవయిత్రి ' మొల్ల' విగ్రహానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాలివాహన సంఘ అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం పూలమాలలు వేసినివాళు లర్పించారు.సంఘ జిల్లా అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీరబ్రహ్మం మాట్లాడుతూ మొల్లమాంబ తండ్రి శివ భక్తుడు కావడంతో చిన్నతనం నుండే ఆమె ఆధ్యాత్మికరంగంపై మక్కువ చూపారన్నారు. సంస్కృతంలో రచించిన రామాయణంను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో తెలుగులో అనువదించారన్నారు. కాలక్రమేనా మొల్లరామాయణంగా పేరుగాంచిందన్నారు. అన్నమాచార్య భార్య తిమ్మక్క తర్వాత రెండవ కవయిత్రిగా మొల్లమాంబ వెలుగొందారన్నారు.అనంతరం వీరబ్రహ్మం చేతుల మీదుగా 100 చీరలను మహిళలకు పంపిణీ చేశారు. అంతకుముందు మల్లమాంబ జయంతి కేక ను మహిళలు కట్ చేశారు.ఈ కార్యక్రమంలో

వెల్ల పాండురంగారావు, పసలపూడి సత్యనారాయణ, మానేపల్లి రామకృష్ణ,మంతెన శ్రీనువాస్, చిరతపూడి హేమలత, మంతెన లక్ష్మి, బిరుదుకోట నాగమణి, పాలకొల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి జనసేన పార్టీ బీమా చెక్కు అందజేత..

**అంబాజీపేట, మార్చి 13, ప్రభాతవార్త..**

మండలంలోని పసుపల్లి గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త నందికోళ్ల సత్యనారాయణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా ఉన్న సత్యనారాయణ కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ ఇంచార్జ్ గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధిలో కీలక భాగస్వామ్యం వహిస్తున్న జన సైనికులకు జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు.జనసైనికులకు ఏమాత్రం ఆపద ముంచికొచ్చినా ఆ కుటుంబానికి బాసటగా నిలిచేందుకు జనసేనాని పవన్ కళ్యాణ్ తగిన ఏర్పాట్లు చేశారని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు,జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, జన సైనికులు కొప్పినీడి సాయి సూర్య, యర్రంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కుపై విద్యార్థులు అవగాహనా ర్యాలీ

**యానాం, మార్చి 13, ప్రభాత వార్త:**

యానాం నియోజకవర్గం యానాంలో ఓటు హక్కును ప్రతీ ఓటరు విధిగా వినియోగించుకోవాలని కోరుతూ యానాం డాక్టర్ ఎస్.ఆర్.కె.ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్.ఎస్.ఎస్.ప్రత్యేక శిబిరంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి ఆయన కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఆవశ్యకతను ప్రతీ ఓటరు తెలుసుకోవాలని కోరారు. ర్యాలీలో విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ పాల్గొన్నారు.ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీ చిన్నా సెంటర్, పిల్లారాయవీధి, జిప్మర్ సెంటర్ తదితర ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఎన్.ఎస్.ఎస్. ఆఫీసర్లు డాక్టర్ సి.నరేష్, ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు,తదితరులు పాల్గొన్నారు.




# హాస్టల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ.

**మామిడికుదురు.మార్చి13 ప్రభాతవార్త.**

ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం, మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో స్థానికబాలుర,బాలికల వసతి గృహాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న సందర్భంగా వారికి సంఘం తరపున పరీక్షలకు అవసరమైన మెటీరియల్ ను మంగళవారం రాత్రి మామిడికుదురు హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల విద్యాశాఖాధికారులు ఎస్.వి.వి.ఎస్.లక్ష్మీ నారాయణ,మోకా వెంకన్నబాబు,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిట్టినీడి నిరంజని, హాస్టల్ వార్డెన్ ప్రవీణ్ కుమార్ సంఘ అధ్యక్షులు భూపతి మనోహర్ రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కళ్యాణ్ బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు, సాధనాల సత్యనారాయణ, ఉపాధ్యాయులు దొంగ సత్యనారాయణ,సంఘ గౌరవ అధ్యక్షులు పెయ్యల వీరభద్ర రావు, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల రమేష్ బాబు బయ్యా మోహనరావు,సంఘ సభ్యులు తరపట్ల గణపతి,కొనుకు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

## సిఐ ప్రశాంత్ కుమార్..

**అంబాజీపేట,మార్చి 13, ప్రభాతవార్త..**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవనిపి.గన్నవరం సీఐ డి.ప్రశాంతకుమార్ హెచ్చరించారు.అంబాజీపేట, మాచవరం, వాకలగరువు,తొండవరం, కె.పెదపూడి పుల్లేటికుర్రు గ్రామాల్లో సాయుధ బలగాలు, పోలీసులు కవాతును బుధవారంనిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంతకుమార్ మాట్లాడుతూ సార్వత్రికఎన్నికలను పురస్కరించుకుని సాయుధ పోలీసు బలగాలతో కవాతులను సమస్యాత్మకగ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు.ప్రతీ ఓటరు స్వచ్ఛందంగా ఓటు హక్కునువినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలు పెట్టినా, భయభ్రాంతులకుగురిచేసినా, ఘర్షణలకు దారితీసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కవాతులోఎస్సై కె.చిరంజీవి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఏ పీ ఎస్ పి క్యాంపస్ లో ట్రస్ట్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

**కాకినాడరూరల్, మార్చి 13(ప్రభాతవార్త):**

మండలం లోని రమణయ్యపేట ఏపీఎస్ పి క్యాంపస్ లోని ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ , ఇన్స్పెక్టర్ జనరల్ రామిరెడ్డి సూచనలతో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీ ఎస్ పి ఎఫ్) కోసం ప్రముఖ వైద్య సంస్థ ట్రస్ట్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ బుధవారంఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు . ఈ శిబిరాన్ని ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ వర్చువల్ గా ప్రారంభించారు.ట్రస్ట్ హాస్పిటల్స్ ఎం డి డాక్టర్ వై.కళ్యాణ్ చక్రవర్తి,డైరెక్టర్స్ డా.రామ కృష్ణ పర్యవేక్షణ లో బిపి,షుగర్, ఈసీజీ వైద్య పరీక్షలను ఉచితంగా చేశారు. సీనియర్ జనరల్ ఫిజిషియన్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ ఫణి రమణ, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సనా ప్రవీణ్,నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మి, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్. నిశాంత్, డాక్టర్ సురేష్, కార్డియాలజిస్ట్ సూపర్ స్పెషలిస్ట్‌లు డాక్టర్ సురేష్ తదితర వైద్య బృందం పాల్గొని సుమారు 200 మంది ఎస్ పి ఎఫ్ సిబ్బంది కి వివిధ వ్యాధుల కోసం వ్యాధి నిర్ధారణపరీక్షలు నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు సూచించారు.ఈ వైద్య శిబిరాన్ని సమర్ధవంతంగా నిర్వహించిన, ట్రస్ట్ హాస్పిటల్స్ వైద్యుల బృందాన్ని ,హాస్పటల్ యాజమాన్యాన్ని ఎస్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బసవ శ్రీనివాసరావు అభినందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# బీసీలకు అండగా వైసిపి

## - పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ వంగా గీతా విశ్వనాథ్

**పిఠాపురం, మార్చి 13 ప్రభాతవార్త :**

బీసీలకు అండగా నిలబడిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పిఠాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జి, కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. పిఠాపురం పట్టణం స్థానిక 19వ వార్డు గుట్ల వీధిలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మించుటకు రూ.కోటి రూపాయల సి ఎస్ ఆర్ నిధులతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. పిఠాపురం బీసీ నాయకులు పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి పద్మ బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీసీ కమ్యూనిటీలు భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమ లక్ష్యంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, బీసీల అభ్యున్నతి కోసం పార్టీ వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. గతంలో నాయకులు కమ్యూనిటీ భవనాల పేరుతో ప్రజలను మోసం చేసిన సంఘటనలు పిఠాపురంలోని జరిగాయని, ఎంపీ నిధులతోనూ సిఎస్ఆర్ నిధులతో నియోజవర్గాన్ని అభివృద్ధి అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు (బాబి), మున్సిపల్ వైస్ చైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి అప్పలరాజు, కౌన్సిలర్లు మఠం లోవరాజు, బండి ఉమామహేశ్వరి రవి, చింతాడ నేలవేణి, సోమరౌతు లలిత, బీసీ నాయకులు గుబ్బల తులసి కుమార్, నల్లమిల్లి పవన్ కుమార్, మేడిశెట్టి ఉమా, కాశి, పల్లా శ్రీనివాసరావు, తాతపూడి రజిని వీరభద్రరావు, వైఎస్ఆర్సిపి నాయకులు కొత్తెం దత్తుడు, బాలిపల్లి రాంబాబు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా హృదయాల్లో చిరస్మరణీయుడు పర్వత చిట్టిబాబు

## టిడిపి ఇంచార్జ్ సత్య ప్రభ

## ఘనంగా పర్వత 8వ వర్ధంతి వేడుకలు

**శంఖవరం, మార్చి 13 ప్రభాతవార్త:**

దివంగత నేత మాజీ శాసనసభ్యుడు టిడిపి జిల్లా అధ్యక్షుడు పర్వత సత్యనారాయణ మూర్తి(చిట్టిబాబు) నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పోరాడే వారని ప్రజా హృదయాల్లో చిరస్మరణీయుడని ప్రత్తిపాడు టిడిపి ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు.చిట్టిబాబు వర్ధంతిని పురస్కరించుకుని మండలం లోని కత్తిపూడి సీతారామ కళాశాలలో గల చిట్టిబాబు విగ్రహానికి కుమార్తె దుర్గాదేవి, టిడిపి ఇన్చార్జ్ సత్య ప్రభ లు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తన తండ్రి చిట్టిబాబు నిరంతరం ప్రజల కోసమే పోరాడే వారని నియోజకవర్గంలో ఎవరకి ఏ సమస్య వచ్చిన తమ సమస్య గా తీసుకుని వెంటనే పరిష్కారానికి కృషి చేసే వారని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే వ్యక్తి చిట్టిబాబు అని నేటికి ఆయన చేసిన సేవలు నియోజక వర్గం అంతటా వ్యాపించి ఉన్నాయి అని కొనియాడారు. సత్య ప్రభ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి పర్వత కుటుంభం ఎప్పుడూ కృషి చేస్తూనే వచ్చిందని శాసన సభ్యుని స్థాయి నుండి జిల్లా అధ్యక్ష పదవి వరకు ఎదిగిన చిట్టిబాబు లేక పోవడం ప్రజలు జీర్ణించుకోలేనిది అని కల్మషం లేని వ్యక్తిగా నిస్వార్థ నాయకుడు గా ప్రజల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి చిట్టిబాబు అని, నిరంతరం ప్రజా శ్రేయస్సే ధ్యేయం గా కృషి చేసే వారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు చిట్టి బాబు చేసిన సేవలు, తన భర్త తెలిపేవారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు వెన్నా శివ, టిడిపి నేత పర్వత సురేష్, నియోజకవర్గ యువత అధ్యక్షులు కీర్తి సుభాష్, కోమ్మల కన్నబాబు, సాధనల లక్ష్మీ బాబు, కంచిపోయిన శ్రీను,బుర్ర వాసు, గాబు శివ, దేశ లింక వెంకటరమణ, దొరబాబు అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



# టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి నానాజీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## : కో కో ఆర్డినేటర్ కటకం శెట్టి బాబి

**కాకినాడ రూరల్,మార్చి13(ప్రభాత వార్త):**

కాకినాడ రూరల్ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకుని వచ్చి, టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ తెలుగు యువత అధ్యక్షుడు కటకం శెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) పార్టీ నేతలను కోరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బుధవారం రూరల్ నియోజకవర్గంలో అసంతృప్తితో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులను కలిసి ఏకతాటి పైకి తీసుకొచ్చి 200 మంది కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. బాబీ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి తప్పనిసరిగా గుర్తింపు వస్తుందని, అందరి సలహాలు సూచనల మేరకు చిన్నచిన్న విభేదాలను పక్కన పెట్టి గెలుపే ప్రధాన లక్ష్యంగా కేడర్ తో కలిసి ప్రయాణం చేయాలన్నారు. నాయకులకు. నాయకులకు, కార్యకర్తలకు ఎవరికి ఏ అవసరం వచ్చినా కోకో ఆర్డినేటర్ గా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు రామదేవు సీతయ్య దొర, కరప మండలం అధ్యక్షుడు దేవు వెంకన్న, నులుకుర్తి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లా బత్తుల అప్పారావు , పాట్నీడి రాంబాబు, కముజు నెహ్రూ, కర్రి శ్రీను ,కొన వెంకటలక్ష్మి, కొండ వినయ్ బచ్చల కామేష్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ పార్కును శుభ్రపరిచిన వలంటీర్లు

**యానాం, మార్చి13,ప్రభాత వార్త:**

యానాం నియోజకవర్గం యానాం అంబేడ్కర్ నగర్‌లోని మున్సిపల్ పార్కును స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్.ఎస్.ఎస్.వలంటీర్లు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ పి.వేలాయుధం ప్రారంభించారు. కళాశాలలో ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్.ఎస్.ఎస్.ప్రత్యేక శిబిరంలో భాగంగా మున్సిపల్ పార్కులో పేరుకుపోయిన చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను, తుప్పలనుతొలగించారు. అదేవిధంగా మధ్యాహ్నం ఓటు హక్కు వినియోగంపై వలంటీర్లు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ని స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద డిప్యూటీ తాహసీల్దార్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును ప్రతీ ఓటరు విధిగా వినియోగించుకోవాలని వలంటీర్లు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్.ఎస్.ఎస్.రీజనల్ కో-ఆర్టినేటర్ సుధాకర్ సహకరించారు. పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.




# పరిశుబ్రమైన త్రాగునీటిని అందిస్తున్నాం

## ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్.ఈ శ్రీనివాస్

**యు.కొత్తపల్లి, మార్చి 13ప్రభాతవార్త :**

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కలుషిత త్రాగునీరు వస్తుందని వచ్చిన పిర్యాదుపై బుధవారం జిల్లా పంచాయతీ అధికారిణి భారతీ సౌజన్యతో కలిసి పరిశీలించారు. కొమరగిరి శివారు గ్రామాలైన నాగంపేట, ఆనంద్ నగర్, వెంకటరాయపురం, చిన్న కలవల దొడ్డిలో త్రాగునీటి ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీటిని పరిశీలించారు. పలువురు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాకతిప్ప లో ఉన్న నాగులాపల్లి ఏరియా మరియు పరిసర గ్రామాల రక్షిత తాగునీటి సరఫరా పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని ధృష్టిలో పెట్టుకుని రిజర్వాయర్ ను పూర్తి స్థాయిలో నింపడం జరిగిందన్నారు. పలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు వేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది, సదరు కాంట్రాక్టర్ లు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుని త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్రాగునీరు పంపిణీలో ఇబ్బందులు ఉంటే వెంటనే సర్పంచులు, కార్యదర్శులు పరిష్కరించాలన్నారు. వారి వెంట ఈఓపీఆర్డి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి వారిజ ఉన్నారు.



# శంఖవరం గ్రంథాలయంలో మొల్ల జయంతి వేడుకలు.

**శంఖవరం, మార్చి 13, ప్రభాత వార్త**

శంఖవరం శాఖా గ్రంథాలయంలో బుధవారం కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. పెద్దాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి పోలంకి నాగరాజు మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మొల్ల రామాయణాన్ని సులువైన పదాలతో తెలుగులో రాసి తన సరళమైన పదజాలానికి అందరూ ముగ్ధులయ్యేలా చేసిన కవయిత్రి మొల్ల అని అన్నారు. అనంతరం నాగరాజు శంఖవరం శాఖా గ్రంథాలయం పరిధిలోని పుస్తక నిక్షిప్త కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చెవల ప్రియాంక, రంగా వీరబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ కార్యక్రమాలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం అగ్రస్థానంలో ఉంది.

## వైఎస్ఆర్సిపి మహిళా నాయకురాలు తోటవాణి.

**గోకవరంమార్చి 13. ప్రభాత వార్త**

రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం అగ్రస్థానంలో ఉన్నదని వైఎస్ఆర్సిపి మహిళా నాయకురాలు తోట వాణి అన్నారు. గోకవరం మండలంలోని గాదెలపాలెం గ్రామంలో బుధవారం వైఎస్ఆర్సిపి మహిళా నాయకురాలు తోట వాణి, శ్రీనిధి రాంజీ గడపగడపకు వైఎస్ఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాదెలపాలెం గ్రామంలోని తోట వాణి, శ్రీనిధి రాంజీ ఇంటింటికి తిరుగుతూ ఆర్థికంగా వెనకబడి ఉన్న పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసిపేదలనుఆదుకుంటుందన్నారు. కుటుంబంలో నాలుగైదు రకాల సంక్షేమ పథకాలు అందుకుంటూ జగన్ నాయకత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు.అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ఆయా ప్రాంతాల్లో త్రాగునీరు సక్రమంగా అందించడానికి జగన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేశారు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగ్గంపేట శాసనసభ్యునిగా తో ట నరసింహాని గెలిపించి రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి జగనన్న ముఖ్యమంత్రిగా చేయటమే మన అందరిధ్యేయము అని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులకు అట్టలు,పెన్నాలు పంపిణీ

**గోకవరం మార్చి13:-ప్రభాత వార్త**

చదువు అనేది వ్యక్తి యొక్క విలువలను పెంచుతున్నదని, ప్రతి ఒక్క విద్యార్థి చదువు పై మక్కువ పెంచుకోవాలని విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షులు కంబాల శ్రీనివాసా రావు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సమ్మేళన సమావేశానికి హాజరైనట్లు,ఈ కార్యక్రమం లో నా తమ్ముడు కంబాల చక్రదరుడు కుమార్తెలిద్దరూ పదవ తరగతి చదువుతున్నారని, వారిద్దరూ సంకల్పంతో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ పరీక్ష అట్టలు, పెన్నలు పంపిణీ చేయాలనికోరినట్లు తెలిపారు. పదవ తరగతి చదువు సుమారు 300 మంది విద్యార్థులకు అట్టలు,పెన్నులు పంపిణి చేసినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో నేను కూడా పూర్వ విద్యార్థినే అని,1978 లో పదవ తరగతి ఇక్కడే 10 వ తరగతి చదువినట్లు విద్యార్థులకు తెలియజేసారు.అనంతరం రానున్న కాలం లో పాఠశాల అభివృద్ధి పనులు చేయిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధ రావు శర్మ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీపై హెచ్ఎమ్ లకు శిక్షణ

**శంఖవరం మార్చి 13 ప్రభాత వార్త**

శంఖవరం మండలంలోని గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 14 (గురువారం)న నిర్వహించేసామాజిక తనిఖీలపై ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సమగ్ర శిక్షా సిఎమ్ఓ చామర్తి నాగేశ్వరరావు నిర్వహించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో సామాజిక తనికీ యాప్ లో సర్వే చేసే విధానం, ఏఏ అంశాలపై తనికీ చేయాలి. ఎవ్వరు నిర్వహించాలి అనే అంశాలపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా ఎంఇఓలు సూరిశెట్టి వెంకటరమణ, గోవిందు మాట్లాడుతూ సామాజిక తనికీనిర్వహణలో అలసత్వం లేకుండా పారదర్శకంగా నిర్వహించి, తనికీ నివేదికను మండల విధ్యాశాఖకార్యాలయంలో అందజేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో మాష్టర్ ట్రైనర్ కుర్రే వెంకటేశ్వరరావు ప్రధానో పాధ్యాయులు, కె నాగరాజు, సీఆర్పీలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.



# డిగ్రీ ఫలితాల్లో శ్రీ ఎస్వీ డిగ్రీ కళాశాల స్టూడెంట్స్ ప్రతిభ

**అమలాపురం టౌన్, మార్చి 13 ప్రభాతవార్త.**

స్థానిక శ్రీ వెంకటశ్వరా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. ఆదికవి నన్నయ యునివర్సిటీ సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో తమ విద్యార్థులు టాపర్లుగా నిలిచారని కాలేజ్ ప్రిన్సిపాల్ కె.ఎస్.వి.ఎన్. మనోహర్ తెలిపారు. బి.ఎస్సీ కంప్యూటర్ చదువుతున్నా జే.కీర్తి 9.5 జి.పి.ఏ తో యూనివర్సిటి టాపర్ గా నిలిచింది అన్నారు.ఎస్. కె. బేగం 9.3 జి.పి.ఏ ,డి పావని 9.1 తో రెండు, మూడు స్థానం లో నిలిశారు.వీరితో పాటు మరో ఇరవై మంది కి ,9.0 నుంచి 9.5 జి.పి.ఎ ల తో ప్రతిభ కనబరిచారు అని అన్నారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.అర్.ఎన్ నరసింహారావు, చైర్ పర్సన్ విజయలక్ష్మి, ఏ. ఓ కరాటం ప్రవీణ్, డా. హేమవిజిత, ఎండీ శ్రావణ్ దిలీప్, అధ్యాపకులు వరప్రసాద్, జాన్ పాల్, శ్రీనివాస్, వెంకటేశ్, సంసొన్, సూర్య కుమారి, దివ్యా,ప్రసన్న, శ్రీలక్ష్మి, సత్య తదితరులు అభినందించారు.



# వైసీపీ కొవ్వొత్తుల ప్రదర్శన

**అమలాపురం,మార్చి13,ప్రభాతవార్త**

టీడీపీ, జనసేన సోషల్ మీడియా మాఫియా ట్రోలింగ్ లకు మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలి కుటుంబానికి సంఘీభావంగా అమలాపురం లో వైసీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు.స్థానిక హైస్కూలు నుండి హైస్కూల్ సెంటర్ నుంచి గడియారస్తంభం సెంటర్ వరకు ర్యాలీ చేసి సెంటర్ లో కొవ్వొత్తుల తో మానవహారం కట్టి ప్రదర్శన నిర్వహించారు.గీతాంజలి కి శ్రద్ధాంజలి ఘటించి సంతాపం తెలిపారు.ఆ కుటుంభానికి సానుభూతిని వ్యక్తం చేశారు.పట్టణ వైసీపీ అధ్యక్షుడు సంసాని బులినాని ఆద్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్ర మణి,నేతలు కాశి మునికుమారి,కొల్లాటి దుర్గాబాయి,పినిపే శ్రీకాంత్, వంటెద్దు వెంకన్నాయుడు, మంగళంపల్లి అంజిబాబు,వైయస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రైల్వే ప్రోజెక్టు పనులు వేగవంతం చేయించండి

**అమలాపురం,మార్చి13,ప్రభాతవార్త**

దశాబ్దాలుగా అసంపూర్తిగా వున్న కోనసీమ రైల్వే పనులు వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయించాలని అమలాపురం వాసి సీనియర్ అడ్వకేట్ రమేష్ చంద్ర వర్మ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కోటిపల్లి నరసాపురం రైల్వే ప్రాజెక్ట్ కి 369 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉండగా నేటికీ కేవలం 163 హెక్టార్ల భూమిని సేకరించారు.ఇప్పుడు కొత్తగా 421 హెక్టార్ల భూమి అవసరం అని రాజ్యసభలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు తెలిపారన్నారు.అమలాపురం వాస్తవ్యుడు అయిన రమేష్ చంద్ర వర్మ ఈనెల 6 న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు.అందుకు సంబంధించిన అంశాలను పరిశీలించడానికి, ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి గౌరవనీయమైన కోర్టు పర్యవేక్షణ లో నిపుణుల కమిటీని నియమించాలని పిటిషన్ లో కోరారు.కోటిపల్లి నర్సాపురం రైల్వే లైన్ ప్రస్తుత అలైన్‌మెంట్ ప్రకారం ఎన్ హెచ్ 216 సమీపంలో భూసేకరణ పరిహారం రేట్ల సమగ్ర పునఃపరిశీలనను నిర్వహించడం, వాటి యొక్కఅధిక వాణిజ్య విలువను పరిగణనలోకి తీసుకోవడం భూయజమానుల తో పారదర్శకంగా కమ్యూనికేషన్చెయ్యాలని అన్నారు.కోటిపల్లి,నర్సాపురం రైల్వే లైన్ యొక్క ప్రస్తుత అలైన్‌మెంట్,ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌లను సమగ్రంగా మూల్యాంకనం చేయాలన్నారు. పర్యావరణ ప్రభావం,భూసేకరణ అవసరాలు ప్రాంతానికి సంభావ్య సామాజిక ఆర్థిక ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవడం ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ల వద్ద భూసేకరణ పరిహారం రేట్ల సమగ్ర పునఃపరిశీలన నిర్వహించా లన్నారు. కోటిపల్లి, నర్సాపురం రైల్వే ప్రాజెక్టు బ్యాలెన్స్ నిర్మాణం పూర్తి చేసేందుకు ఉత్తమమైన అలైన్‌మెంట్‌ను చేపట్టాలని సూచించారు.ప్రాజెక్ట్ ప్రణాళిక, అమలు దశల అంతటా పారదర్శకంగా,సమ్మిళిత ప్రజా భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి, ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి, మార్కెట్ రేట్లను భూయజమాను లకు ఇవ్వడానికి హైకోర్టు పరిధిలో కమిటీ వేయాలని వర్మ కోరారు.

# కాకినాడ రూరల్ అభివృద్ధి కి కోరమండల్ వారు రూ.52 లక్షలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి 13 ప్రభాతవార్త**

కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎరువుల కర్మాగారం వారు కాకినాడ జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ కృత్తికా శుక్లా కి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం కోరమాండల్ సి.ఎస్.ఆర్.నిధులనుండి రూ.5200000 (ఏభైరెండు లక్షల రూపాయలు) చెక్కును అమీర్ అల్వీ(ప్రెసిడెంట్, కోరమాండల్ పోషక ఎరువులు విభాగం) అందించారు . ఈ నిధులను ఆయా నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనాల నిర్మాణంలకు మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ కాకినాడ యూనిట్ హెడ్ సి.హెచ్.శ్రీనివాసరావు, జి.ఎమ్.హెచ్.ఆర్.పద్మనాభం మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్ఈజెడ్ రైతులకు వరాలను ప్రకటించిన సియం

**యు.కొత్తపల్లి, మార్చి 13ప్రభాతవార్త :**

కాకినాడ కేఎస్ఈజడ్ రైతులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన వరాలను దేశంలో మరే ముఖ్యమంత్రి ప్రకటించలేదని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జి వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారి పోడులో బుధవారం అరబిందో ఫార్మా కంపెనీ నిధులు సుమారు రూ.కోటి తో గ్రామం నుండి బీచ్ రోడ్డు వరకు నిర్మించబోయే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కేఎస్ఈజడ్ రైతులకు పూర్తిగా అన్యాయం చేశాయని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత మాజీ మంత్రి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అధ్యక్షతన హై పవర్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ సూచనల మేరకు ఎస్ ఈ జెడ్ ల చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సుమారు 2200 ఎకరాల భూమిని తిరిగి రైతులకు అప్పగించడం జరిగిందన్నారు. శ్రీరాంపురం గ్రామంలో మరిన్ని రోడ్లను అభివృద్ధి చేయవలసి ఉందన్నారు. ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో నిర్మిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న గ్రామ సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు గాను సీఎం జగన్మోహన్ రెడ్డి 12.60 మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రావి రమేష్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, చెట్టు బత్తిని సురేష్ కుమార్, వైయస్సార్ సిపి మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, పలువురు ప్రజా ప్రతినిధులు, వైయస్సార్సీపి నాయకులు, అరబిందో ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి : జిల్లా కలెక్టర్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి 13 ప్రభాతవార్త**

ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశపుమందిరం నందు ఓటు హక్కు విలువలు తెలుపుతూ ప్రచురించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బందికి ఓటు హక్కు వినియోగం పై అవగాహన నిర్వహించారు. ప్రజాస్వా మ్యంలో ప్రతి ఒక్క ఓటుకు ఎంతో విలువ ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమన్నారు., నీ ఓటు, నీ భవిష్యత్తు అని నిన%శీ%దిస్తూ ఓటును అమ్ము కోవద్దు, నిస్వార్థంగా సేవలందించే వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలని ఓటు అమ్ముకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ వెంకటేశ్వర్లు ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డివిజనల్ ఇంజనీర్ సుబ్బరాజు, సాంఘిక సంక్షేమ బీసీ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీశ్రీశ్రీ వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రత హెూమం

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం**

**అమలాపురం మార్చి 13 (ప్రభాతవార్త):**

దేవళ్ళ శ్రీనివాస్ వారి ఇంటి వద్ద శ్రీ వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగకాల భైరవబాబా శ్రీ వేణు దత్తాత్రేయ రామదూత స్వామి ప్రథమ శిష్యులు అమ్మవార్లు పవిత్రమ్మ, అపర్ణ లు విచ్చేసి ఈ వ్రతం జరిపించారు.సాయంత్రం శివకోడు గ్రామం లో కర్రా రామకృష్ణ, రాజోలు గ్రామం లో నార్కెట్ మిల్లి బాలకృష్ణ వ్యాపార సముదాయ భవనము పై శ్రీ వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగ కాల భైరవభవ బాబా శ్రీ వేణు దత్తాత్రేయ రామదూత స్వామి ప్రథమ శిష్యులు అమ్మవార్లు పవిత్రమ్మ, అపర్ణ విచ్చేసి ఈ వ్రతం జరిపించారు. ఈ కార్యక్రమానికి శివకోడు రాజోలు గ్రామాలలోని రామదూత స్వామి భక్తులు పాల్గొన్నారు. ఈ వ్రతానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది.







Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps



# ఉత్తర ప్రదేశ్
## రైతులను సుఖ సంతోషాలతో పోషిస్తోంది
## సౌభాగ్య విత్తనాలను నాటుతోంది

### పియం కిసాన్ సమ్మాన్ నిధి క్రింద
### రూ 68,139 కోట్లు బదిలీతో
### 2.68 కోట్ల రైతులకు జీవన సౌభాగ్యం

- భారతదేశం యొక్క ఫుడ్ బ్యాస్కెట్‌గా గుర్తింపు
- పాడి,చెరకు, బంగాళదుంప, మామిడి మరియు ఉసిరి ఉత్పత్తులలో దేశంలో అగ్రస్థానం
- నంద్ బాబా పాడి మిషన్ క్రింద 585 పాల సమృద్ధి కమిటీల ఏర్పాటు
- పియం కుసుమ్ యోజన క్రింద రైతులకు 51,774 సౌర పంపుల స్థాపన
- తిండి గింజల సమృద్ధి ఉత్పత్తికి ఉత్తర ప్రదేశ్ చిరు ధాన్యాల పునరుజ్జీవ పథకం నిర్వహణ
- వివిధ చిరుధాన్యాల పంటల సమృద్ధికి అంతర్జాతీయ చిరుధాన్యాల - 2023 పురస్కరించుకొని 43,000 కంటే ఎక్కువగా మినీ విత్తన కిట్స్ పంపిణీ
- 14.38 లక్షలకు పైగా గోవుల సంరక్షణకు 7,239 గోవుల సంరక్షణ శాలలు స్థాపన
- సముదాయక పురోగతికి 3,421 రైతు ఉత్పత్తుల సంస్థలు (ఎఫ్‌పిఓ లు)
- 49 జిల్లాలలో 85,710 హెక్టార్ల భూమిలో ప్రకృతి సహజ వ్యవసాయాభివృద్ధి
- 5.1% ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల సమృద్ధి సాధన మరియు 625 లక్షల మెట్రిక్ టన్నుల కంటే
- అధికంగా తిండి గింజల ఉత్పత్తి మరియు 21.57 లక్షల మెట్రిక్ టన్నుల నూనెగింజల సమృద్ధి ఉత్పత్తి
- 125 మండీల స్థాపన
- జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఇ-నామ్) ద్వారా 3,468 కోట్ల విలువైన డిజిటల్ వ్యాపారంలో ముందడుగు
- అగ్రిటెక్ స్టార్ట్ అప్‌లు ఇన్‌క్యూబేషన్ కేంద్రాల స్థాపన
- వ్యవసాయ ప్రోత్సాహ పురోగతి లక్షంగా ముఖ్యమంత్రి ఖేత్ సురక్ష యోజన ఆవిష్కరణ







## కిసాన్‌కు నిరంతర సేవా సహాయం
## డబుల్ ఇంజన్ ప్రభుత్వ లక్ష్యం

సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, ఉత్తరప్రదేశ్



# ఉత్తర ప్రదేశ్
## రైతులను సుఖ సంతోషాలతో పోషిస్తోంది
## సౌభాగ్య విత్తనాలను నాటుతోంది

### పియం కిసాన్ సమ్మాన్ నిధి క్రింద రూ 68,139 కోట్లు బదిలీతో 2.68 కోట్ల రైతులకు జీవన సౌభాగ్యం

- భారతదేశం యొక్క ఫుడ్ బ్యాస్కెట్‌గా గుర్తింపు
- పాడి,చెరకు, బంగాళదుంప, మామిడి మరియు ఉసిరి ఉత్పత్తులలో దేశంలో అగ్రస్థానం
- నంద్ బాబా పాడి మిషన్ క్రింద 585 పాల సమృద్ధి కమిటీల ఏర్పాటు
- పియం కుసుమ్ యోజన క్రింద రైతులకు 51,774 సౌర పంపుల స్థాపన
- తిండి గింజల సమృద్ధి ఉత్పత్తికి ఉత్తర ప్రదేశ్ చిరు ధాన్యాల పునరుజ్జీవ పథకం నిర్వహణ
- వివిధ చిరుధాన్యాల పంటల సమృద్ధికి అంతర్జాతీయ చిరుధాన్యాల - 2023 పురస్కరించుకొని 43,000 కంటే ఎక్కువగా మినీ విత్తన కిట్స్ పంపిణీ
- 14.38 లక్షలకు పైగా గోవుల సంరక్షణకు 7,239 గోవుల సంరక్షణ శాలలు స్థాపన
- సముదాయక పురోగతికి 3,421 రైతు ఉత్పత్తుల సంస్థలు (ఎఫ్‌పిఓ లు)
- 49 జిల్లాలలో 85,710 హెక్టార్ల భూమిలో ప్రకృతి సహజ వ్యవసాయాభివృద్ధి
- 5.1% ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల సమృద్ధి సాధన మరియు 625 లక్షల మెట్రిక్ టన్నుల కంటే అధికంగా తిండి గింజల ఉత్పత్తి మరియు 21.57 లక్షల మెట్రిక్ టన్నుల నూనెగింజల సమృద్ధి ఉత్పత్తి
- 125 మండీల స్థాపన
- జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఇ-నామ్) ద్వారా 3,468 కోట్ల విలువైన డిజిటల్ వ్యాపారంలో ముందడుగు
- అగ్రిటెక్ స్టార్ట్ అప్‌లు ఇన్‌క్యూబేషన్ కేంద్రాల స్థాపన
- వ్యవసాయ ప్రోత్సాహ పురోగతి లక్ష్యంగా ముఖ్యమంత్రి ఖేత్ సురక్ష యోజన ఆవిష్కరణ







## కిసాన్‌కు నిరంతర సేవా సహాయం

## డబుల్ ఇంజన్ ప్రభుత్వ లక్ష్యం

సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, ఉత్తరప్రదేశ్



# వేలాదిమందికి అమ్మగా మారింది..

ప్రేమను పంచడంలో అమ్మ తర్వాతే ఎవరైనా! కొంతమంది తల్లులు తమ పిల్లల్లాగే.. ఇతరులను సైతం ప్రేమగా చూసుకుంటుంటారు. కడుపున జన్మించక పోయినప్పటికీ ఆ తల్లి చూపే ప్రేమాభిమానాలకు అమ్మ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు. ఈ కోవకు చెందిన వారే బిందు రమాకాంత్ ఘట్ పాండే. బిందుని తన పిల్లలేగాక, వేలాదిమంది 'అమ్మ' అని అప్యాయంగా పిలుస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న వారికి కడుపునిండా భోజనం పెడుతూ ఎందరికో అమ్మగా మారింది బిందు రమాకాంత్ ఘట్‌పాండే. అంతమందికి అమ్మగా మారిన బిందు గురించి ఆమె మాటల్లోనే..

రాజస్థాన్‌లోని ఝుంఝునులో పుట్టాను. ముగ్గురు అక్కచెల్లెళ్లు, నలుగురు అన్నదమ్ములు ఉన్న పెద్ద కుటుంబం మాది. నాన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. ఉద్యోగరీత్యా ప్రతి రెండేళ్లకోసారి నాన్నకు బదిలీలు జరిగేవి. దీంతో చాలా భాషలు పరిచయం అయ్యాయి. పంజాబీ, హిందీ, బెంగాలీ, మరాఠీ భాషలు చక్కగా మాట్లాడగలను. నా పెళ్లి అయిన తరువాత మా ఆయనతో కలిసి భోపాల్‌లో స్థిరపడ్డాను. నాకు ఇద్దరు పిల్లలు. మా అబ్బాయి కోల్‌కతా ఐఐఎమ్ టాపర్. అమ్మాయి దుబాయ్‌లో రేడియో జాకీ. యాంకర్‌గా పనిచేస్తోంది. పిల్లల బాధ్యతలు తీరాక నాకు చాలా ఖాళీ సమయం దొరికింది. ఈ సమయంలో సమాజానికి ఏదైనా మంచి చేయాలనిపించింది.

**ఏం చేయాలా..** అని ఆలోచిస్తున్న సమయంలో ఒకరోజు టివిలో 'గ్రాండ్ మదర్స్ కిచెన్' గురించి చూశాను. అప్పుడే నాకు కూడా ఆకలితో అలమటించే వారికి అన్నం పెట్టాలన్న ఆలోచన వచ్చింది. మా ఆయనకు చెప్పాను. దానికి ఆయన ఒప్పుకున్నారు. వెంటనే ఇంట్లో భోజనం తయారు చేసి కారులో పెట్టుకుని రోడ్డుమీదకు ఆకలితో ఉన్న వారు కనిపిస్తే వారికి భోజనం పార్శిల్ ఇచ్చేదాన్ని. వాళ్లు తిన్న తరవాత చెప్పే కృతజ్ఞతలతో నాకు కడుపు నిండిపోయేది. అలాగే ఉదయాన్నే పాతిక లీటర్ల గంజి తయారు చేసి వీధికుక్కలకు పోసేదాన్ని. ఆ తరువాత 'ఉత్కర్షిణి' పేరిట కిచెన్‌ను ఏర్పాటు చేశాను. ప్రస్తుతం ఈ ఉత్కర్షిణి వేల మంది ఆకలి తీరుస్తోంది.

**రోజుకోమెను...** కిచెన్‌లో ఎంతో పరిశుభ్రంగా భోజనం వండిస్తాను. తయారీ అంతా నా పర్యవేక్షణలో జరుగుతుంది. రోజుకొక మెను పెడుతున్నాను. ఒక రోజు పప్పు, కూరలు, అన్నం పెడితే.. మరుసటిరోజు రాజ్మా, అన్నం, ఇంకోరోజు పూరీ, కూరలతో వడిస్తున్నాం. పప్పు, అన్నం అయితే ప్లేటు ఐదు రూపాయలకు, రసగుల్లా, హల్వా పూరీ ఉన్న రోజు ప్లేటు ఇరవై రూపాయలకు విక్రయిస్తున్నాం. మా భోజనం తినేవారి సంఖ్య పెరగడం.. 'భోజనం బావుంది, కానీ స్వీట్ ఉంటే బావుంటుంది అని కస్టమర్లు చెప్పడంతో తొలుత హల్వా పెట్టడం మొదలుపెట్టాము. ఇప్పుడు రసగుల్లా కూడా పెడుతున్నాం.

**ఆకలి తీరడానికి మాత్రమే..**

ఉత్కర్షిణి కిచెన్‌లో తయారైన భోజనానికి ఎలాంటి నిబంధనలు లేవు. నిరుపేదల నుంచి ఎవరైనా తినవచ్చు. మా భోజనం తినేవారిలో పారిశుధ్యకార్మికులు, రిక్షా నడిపేవాళ్లు, నర్సులు, డాక్టర్లు, విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎవరికి ఆకలి వేసినా తిని వెళ్లాల్సిందే తప్ప.. ఇంటికి ప్యాక్ చేసి ఇవ్వడం లేదు. ఆసుపత్రికి వచ్చే రోగులు మందులు వేసుకునే ముందు ఏదైనా తినాలని చెప్పి సమోసా, బిస్కెట్లు తింటుంటారు. ఇవి ఆరోగ్యానికి మంచిది కాదు. అందుకే వీరు సైతం తినేలా మా కిచెన్ ఆహార పదార్థాలు అందిస్తోంది.

**అలా వందలమందికి....**

నేను పెడుతోన్న భోజనానికి డిమాండ్ పెరగడంతో వంటవాళ్లను పెట్టుకుని వండించడం మొదలుపెట్టాను. ప్రస్తుతం ఆసుపత్రి, దానిపక్కన స్టూడెంట్ క్యాంపస్ ఉంది. అక్కడ భోజనం ప్లేటు ఐదు రూపాయలకు ఇస్తున్నాను. చాలామంది విద్యార్థులు వచ్చి తింటున్నారు. అలా నా దగ్గర భోజనం చేయడానికి వచ్చేవారు నన్ను 'అమ్మ లేదా మా' అని పిలుస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం మా ఉత్కర్షిణి కిచెన్ కుటుంబం రోజురోజుకి పెరిగిపోతోంది. అందుకే త్వరలో భోపాల్‌లోని ఇతర ప్రాంతాలకు కూడా నా సేవలను విస్తరించబోతున్నాను. మరింత మంది ఆకలి తీర్చడమే నా లక్ష్యం అని చెప్పింది బిందు రమాకాంత్ ఘట్‌పాండే.



# ఫేషియల్ తర్వాత ఇలా వద్దు..



**శుభకార్యాల సందడి మొదలైపోయింది. మరి వేడుకల్లో మెరిసిపోవాలంటే ముఖానికి ఫేసియల్ చేయాంచాల్సిందే అంటారా? అయితే, తరవాత కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే మాత్రం అసలుకే మోసం వస్తుంది. అలా కాకుండా ఉండాలంటే..**

- పార్టీకి వెళ్లాలనే తొందరలో ఫేషియల్ చేయించుకున్న వెంటనే కొంతమంది మేకప్ వేస్తుంటారు. ఆ కాస్మెటిక్స్ చర్మం రంధ్రాల్లోకి వెళ్లి మొటిమలు రావడానికి కారణమవుతాయి. ఫేషియల్ చేయించుకున్నాక చర్మం సున్నితంగా ఉంటుంది కాబట్టి తేమను తిరిగి పొందడానికి మాయిశ్చరైజర్ రాసుకుంటే మంచిది.
- ఫేషియల్ తరవాత స్కార్ఫ్ లేకుండా బయటకు వస్తే అతినీలలోహిత కిరణాల వల్ల చర్మంపై నల్లటి మచ్చలు ఏర్పడుతుంటాయి. అందుకే ముఖానికి సన్‌స్క్రీన్ రాయడం మర్చిపోకూడదు.
- చేతులతో ముఖాన్ని తాకే అలవాటు చాలామందిలో ఉంటుంది. ఫేషియల్ తరవాత ఇలా చేస్తే చేతులకు ఉన్న బ్యాక్టీరియా చర్మంపైకి చేరి మొటిమలు, మచ్చలకు కారణమవుతుంది. ముఖంపై ఉన్న దుమ్మూధూళిని తొలగించడానికి క్లెన్సర్ వాడాలి. అంతేకాదు, నీటిని ఎక్కువగా తీసుకుంటూ చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచాలి. ముఖం తేమగా ఉండడమే కాదు, మృదువుగానూ మారుతుంది.

# సొరకాయ చపాతీలు



ఆలూ చపాతీ, మేతీ చపాతీ ఇలా చాలా రకాలుగా రుచకరమ చపాతీలను చేసుకోవచ్చు. కానీ చపాతీలు చేయాలంటే.. మెత్తగా వస్తాయో రావోనని చాలామందికి భయం. పిండి సరిగ్గా కలపకపోయినా, ఇంగ్రేడియంట్స్ సమపాళ్లలో పడకపోయినా, చపాతీలు మన మాట వినవు. మరి సొరకాయ చపాతీ ఎపుడైనా ట్రై చేశారా? మెత్తగా దూదుల్లాంటి సొరకాయ చపాతీ ఎలా చేయాలో చూద్దాం.

**కావలసినవి :** సొరకాయ తురుము–రెండు కప్పులు, పచ్చిమిర్చి తరుగు–టీ స్పూన్, గోధుమపిండి– రెండున్నర కప్పులు, గరం మసాలా– అరటీ స్పూన్, ఉప్పు– చిటికెడు, ఇంగువ– చిటికెడు, నూనె– రెండు టేబుల్ స్పూన్లు.

**తయారీ:** వెడల్పుగా ఉన్న పాత్రలో గోధుమపిండి, సొరకాయ తురుము, తరిగిన పచ్చిమిర్చి, గరం మసాలా పొడి, ఉప్పు, ఇంగువ వేసి కలపాలి. మొదట తేమ సరిపోదనిపించినప్పటికీ సొరకాయలో నీరు వదిలేకొద్దీ సరిపోతుంది. పది నిమిషాల సేపు పక్కన ఉంచితే నీరు బయటకు వస్తుంది. నీరు వదిలిన తర్వాత పిండిని కలిపి చూసుకుని అప్పటికీ పొడిగా అనిపిస్తే కొద్దిగా నీటిని చిలకరించుకుని మిశ్రమం మొత్తాన్ని చపాతీ పిండిలా చేసుకుని వస్త్రాన్ని కప్పి పావు గంట సేపు పక్కన ఉంచాలి. పిండిని పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసుకుని చపాతీల్లా వత్తుకుని పెనం వేడి చేసి నూనె వేస్తూ చపాతీని రెండు వైపులా కాల్చాలి.





# చోకర్‌కి నెక్లెస్ జోడీ

పెళ్లో, పేరంటమో మెడ నిండుగా నగలు వేసుకుంటే ఆ అందమే వేరు. అందుకోసమే పొడవాటి హారానికి జతగా మెడ వరకూ మాత్రమే ఉండే నెక్లెస్సో, చోకరో పెట్టుకుని మురిసిపోతుంటాం. అయితే, ఎప్పుడూ ఒకటే శైలిని అనుసరిస్తామంటే ఎలా అనుకున్నారో ఏమో గానీ డిజైనర్లు.. దానికి భిన్నంగా ఇప్పుడు చోకర్‌కి నెక్లెస్‌ని జోడీగా సెట్ చేసి మగువల సోయగాన్ని రెట్టింపు చేస్తున్నారు. వీటిల్లో అచ్చంగా బంగారంతో చేసినవే కాదు, పోల్కీ కుందన్లూ, ముత్యాలూ, పచ్చలూ కలగలిపినవీ, టెంపుల్ డిజైన్లూ, నవరత్నాల సెట్లు.. ఒకటేమిటి ఎన్నెన్నో రకాలను మ్యాచ్ చేసి మెరిసిపోయేలా చేస్తున్నారు. చోకర్–నెక్లెస్ కలిపిన ఈ సెట్లు పెట్టుకోవడం వల్ల ఆధునికంగానే కాదు..అందంగానూ కనిపిస్తుండటంతో ఈతరం అమ్మాయిలూ వీటిని మెచ్చేస్తున్నారు. చీర, లెహెంగా, లాంగ్‌ఫ్రాక్ దేనిమీదకైనా చక్కగా అమరిపోతున్న వీటిని వేసుకుని సంబరపడిపోతున్నారు. వాటినోసారి మీరు చూస్తే.. మనసుపారేసుకోకుండా ఉండలేరు.











## చెలిచిట్కా

తలకే కాకుండా శరీరానికి కూడా నూనెను పట్టించి మర్ధన చేయడం వలన శరీరానికి చక్కని వ్యాయామం లభించి దేహపుష్టి కలుగుతుంది.

# పరీక్షల ఫోబియాను జయించాలి..



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**



ప్రశ్న: మా అమ్మాయి ఇంటర్ పరీక్షలు రాస్తోంది. తొలిరోజు పరీక్షల హాలులోకి వెళ్లగానే కళ్ళు తిరిగి పడిపోయింది వెంటనే అక్కడ సిబ్బంది ముఖం మీద నీళ్ళు చల్లి కూర్చోబెట్టి సేద తీర్చారు. కొంత సమయం గడిచిన తరువాత కోలుకున్నది. అన్ని ప్రశ్నలకు జవాబులు రాసినా పూర్తి స్థాయిలో సామర్యం చాటుకోలేకపోయింది. ఇంటికి వచ్చిన తరువాత చాలా దిగులుగా కనిపించింది. కొంత సేపటి తరువాత విపరీతంగా తలనొప్పి వచ్చింది. ఆ తరువాత వాంతి చేసుకున్నది. ఆ సమయంలో చేతులు చల్లబడ్డాయి. శరీరం అంతా చమట్లు పటాయి. శ్వాస తీసుకోవడం కష్టం అయింది. తరువాత డాక్టర్ వద్దకు తీసుకెళితే తలనొప్పి, వాంతులు తగ్గడానికి మందులు ఇచ్చారు. పరీక్షల భయం, ఒత్తిడి, నిద్రలేమి వల్ల ఇలా జరిగిందని చెప్పారు. మనసును ప్రశాంతంగా ఉంచుకోమని ఆత్మ విశ్వాసం పెంచుకోమని సలహా ఇచ్చారు. అయితే ఆమె భయం నుంచి బయటపడలేకపోతున్నాది. పరీక్షలు రాస్తున్నప్పటికి పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం చేయడం లేదు. ఆమె ఎలాగైనా డాక్టర్ కావాలన్నపట్టుదలతో చదివింది. రోజు పన్నెండు గంటలు చదివింది. ఎక్కడ ఏది అడిగినా చెప్పగలిగేది నిద్రలో లేపి అడిగినా ప్రశ్నలకు జవాబు చెప్ప గలిగే స్థితిలో ఉండేది. చిన్నప్పటి నుంచి చాల చురుగ్గా ఉన్న ఆమె ఇప్పుడు ఎందుకు ఇలా అయ్యిందో అర్థం కావడం లేదు. తాను అనుకున్న స్థాయిలో మార్కులు తెచ్చుకోలేకపోతున్నాని బాధ పడుతున్నది. ఆమెను చూసి మా చిన్నమ్మాయి ఆందోళన పెంచుకుంటున్నది ఆమె పదవతరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్నది. అక్క లాగా తనకు ఇలాంటి సమస్య ఎదురౌతుందేమోనని భయ పడుతున్నది. ఈ నేపథ్యంలో మాకు మంచి మార్గం చెప్పండి. **- ఒక సోదరి, తిరుపతి.**

**జవాబు :** అమ్మా మీ అమ్మాయి పరీక్షల ఫోబియాతో బాధపడుతున్నదని అర్థం అవుతున్నది. సహజంగా పరీక్షలు అనగానే ప్రతివారిలో కొద్దిపాటి అలజడి ఉంటుంది. భయం, ఆందోళన తక్కువ లేదా ఒక మోస్తరు స్థాయిలో ఉండే అవకాశాలు లేకపోవు. అయితే ప్రతికూల భావాలు, అనవసర ఆలోచనలు, శక్తిమించిన లక్ష్యాలు భయం, ఆందోళనకు కారణం అవుతాయి. నిద్రలేమి, శారీరక శక్తి తగ్గడం, పరిసరాల ప్రభావం వాటిని పెంచి పోషిస్తాయి. తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తాయి. అన్నీవెలసి కొందరిలో ఫోబియాకు దారితీస్తాయి. ఫోబియా అంటే ఊహాత్మక భయం లేదా భీతి అనవచ్చు. అంటే ఒక అంశం ఊహలోకి రాగానే భయపడుతుంటారు. వంటిలో వణుకు పుడుతుంది. కొంత మందిలో తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. దీనిని నుంచి బయట పడటానికి సానుకూల ఆలోచనలు చాలా దోహదపడుతాయి. అంటే సమస్యను ఎదుర్కోగలము ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి. లక్ష్యం సాధించాలంటే కష్టాలు తప్పవు, ఆఖరికి విజయం సాధిస్తాము లాంటిఆలోచనలు చేయడం అలాగే కొంత వాస్తవిక దృష్టిని పెంచుకుంటే మనసుకుదట పడుతుంది. తగిన నిద్ర విశ్రాంతి చాల అవసరం ధ్యానం, ధీర్ఘ శ్వాసలు, సెల్ఫ్ హిప్నాటిజం ద్వారా మనసును కుదట పరచవచ్చును. సమతుల ఆహారం తేలిక పాటి వ్యాయామాలు ఉపయుక్తంగా ఉంటాయి. మరీ తీవ్రస్థాయిలో ఉంటే మాత్రం సైకియాట్రిస్టు సలహాలతో మందులు వాడటం మంచిది. తొలి నుంచి జాగ్రత్తలు తీసుకుంటే పరీక్షల సమయంలో ఇబ్బందులు ఉండవు.

వ్యధ

# తాజాదనం ఎక్కువసేపు..

ఎంత మదిదోచే పెర్‌ఫ్యూమ్ అయినా.. కాసే పటికే దాని ప్రభావం తగ్గిపోతుంది. అలా కాకుండా ఎక్కువసేపు పరిమళాలు వెద జల్లుతూ.. మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచాలంటే..

దగ్గరగా ఉంటాయి. అందుకే మెడ దగ్గర స్ప్రే చేస్తే పరిమళం చక్కగా వ్యాపిస్తుంది. ఎక్కువ సేపు ఆ తాజాదనం నిలిచి ఉంటుంది. కానీ రాళ్ల పొదిగిన ఆభరణాలపై పడితే వాటి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది.

**చెవుల వెనుక :** ఇక్కడ చర్మం చలా సున్నితంగా ఉంటుంది. సువాసన నిలిచి ఉండాలన్నా, వ్యాపించాలన్నా పరిమళాన్ని అక్కడ స్ప్రే చేయాలి. పార్టీలు, వేడుకలప్పుడు.. ఆత్మీయులతో కాస్త దగ్గరగా మసులు తుంటాం కాబట్టి ఈ విధంగా ప్రయత్నించి చూడండి. అలాగని అతిగా ఉపయోగించొద్దు. చర్మానికి హాని కలగొచ్చు. తలనొప్పి వంటి సమస్యలూ ఎదురవుతాయి.

**మెడ చుట్టూ :...** ఇక్కడ రక్తనాళాలు చర్మ ఉపరితలానికి

**మణి కట్టు :** చర్మం సున్నితంగా ఉంటుందిక్కడ. ఇక్కడ పెర్‌ఫ్యూమ్ రాసి, రుద్దితే.. చేతి కదలికల వల్ల సువాసన వ్యాపిస్తుంది. రోజంతా తాజాగా ఉన్న భావన కలుగుతుంది.

**మోకాళ్ల వెనుక :** ఈ ప్రాంతంలో వెచ్చగా ఉంటుంది. ఇక్కడ పెర్‌ఫ్యూమ్ రాసి, రుద్దితే.. చేతి కదలికల వల్ల సువాసన వ్యాపిస్తుంది. రోజంతా తాజాగా ఉన్న భావన కలుగుతుంది.

**మోకాళ్ల వెనక :** ఈ ప్రాంతంలో వెచ్చగా ఉంటుంది. ఇక్కడ స్ప్రే చేస్తే సుమాసన చుట్టుపక్కలకు సులభంగా వ్యాపిస్తుంది.

# ఒకసారి శరణు వేడిన చాలును!

ఆధ్యాత్మికం



**నల్ల మస్తాన్ గారు** గుంటూరుకు వచ్చిన తొలి దినాలలో ఒక రోజు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా వాన కురవసాగింది. విశేషమేమిటంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి ఇంటిపై ఒక వర్షపుచుక్క కూడ పడకపోవటం. ఇంతలో పిడుగు పడి ఒక మేక పిల్ల. ఒక మనిషి మరణించారు. వర్షం తగ్గింది. మస్తాన్ గారు సమాధి నుండి లేవగానే మరణించిన మేకపిల్ల కనిపించింది. ఆయన దానివద్ద కూర్చొని, భగవధ్యానం చేసి, దాని చుట్టూ ముమ్మారు తిరిగి 'ఉఠో' అన్నారు. ఆ మేకపిల్ల లేచి మస్తాన్ గారి పాదాల సందునుండి దూరి వెళ్లిపోయింది. ఈ వార్త ఊరంతా వ్యాపించగా పిడుగుపాటుతో మరణించిన వ్యక్తి తల్లి వచ్చి, మస్తాన్ గారి పాదాలను పట్టుకుని వల, వల దుఃఖించింది. కరుణా సముద్రుడు ఆ తల్లి దుఃఖం చూడలేకపోయాడు. శవం వద్దకు పోయి దైవ ధ్యానం చేసి, శరీరాన్ని తాకాడు. వెంటనే విగత జీవికి ప్రాణం వచ్చింది. లేచి కూర్చున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన ఏ జీవి అయినా అదృష్టవంతులే, జంతువు కావచ్చు, మనిషి కావచ్చు.

షిరిడీలోని ద్వారాకామాయిలో కొలువై ఉన్న సాయి ఇందుకు భిన్నుడు కాదు. అది 1917వ సంవత్సరం. వైశాఖ మాసం (మే నెల). ఎండలు మండిపోతాయని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక పిచ్చి కుక్కచే కరవబడిన ఒక చిన్ని కుక్క వెంటబడ్డారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే నానుడి జంతువులకు కూడా వర్తిస్తుంది. అది ద్వారకామాయిలోనికి పరుగు తీసింది. గ్రామస్తులందరు అది బయటకు వస్తే చంపటానికి బయట నిలబడి 'బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరమండి, దానిని చంపెదము అనగా, సాయిబాబా పిచ్చివారలారా! దూరంగా పొండు. దిక్కులేని ఈ చిన్న జీవిని చంపదలచినారా. అన్నాడు. ఆ జీవి రక్షణ పొందింది. అంతియే కాదు దాని పిచ్చి కూడా మటుమాయమైంది. సాయినాథుని పాదధూళితో పరమ పావనమైన ద్వారకామాయిని శరణు వేడిన వారికి ఆపదలు ఆమడ దూరం పోతాయి. సాయి రక్షణ పొందిన చాలు – భీతికి తావు ఉండదు.

**- యం.పి.సాయినాథ్**



# ప్రపంచ నెం.1 టెస్ట్ బౌలర్‌గా అశ్విన్

## ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్ర స్థానంలో జడేజా

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ప్రపంచ నెంబర్‌వన్ టెస్ట్ బౌలర్‌గా భారత్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ నిలిచాడు. అలాగే ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా అగ్రస్థానంలో సంపాదించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో ధర్మశాల వేదికగా జరిగిన టెస్ట్‌లో అశ్విన్ తొమ్మిది వికెట్లు కూల్చి నెంబర్ వన్ స్థానానికి చేరాడు. అంత ర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బుధవారం టెస్ట్ ర్యాంకిం గ్స్‌ను విడుదల చేసిం ది. టీమిండియా మరో బౌలర్ జన్‌ప్రీత్ బుమ్రా మూడో స్థానానికి పడిపోగా, కుల్దీప్ యాదవ్, రోహిత్ శర్మ, యశస్వీజైస్వాల్ సైతంతమ ర్యాంక్‌లను మెరుగుపరుచుక ున్నారు. ఇక ధర్మశాలతో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో అశ్విన్ తొలి ఇన్నింగ్స్‌లో 4వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు నేలకూల్చాడు. రెండు ఇన్నిం గ్స్‌లతో కలిపి అశ్విన్ 128 పరుగులు ఇచ్చి 9 వికెట్లు తీశాడు. దీంతో టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నెంబర్‌వన్ బౌలర్‌గా నిలిచాడు. ఇందుకు ముందు ఈ స్థానంలో టీమిండియా బౌలర్ జన్‌ప్రీత్ బుమ్రా కొనసాగాడు. ఇక ధర్మశాలతో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో అశ్విన్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు చొప్పున 128 పరుగులు ఇచ్చి 9 వికెట్లు తీశాడు. దీంతో టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచాడు. ఇందకు ముందు ఈ స్థానంలో టీమిండియా బౌలర్ జస్‌ప్రీత్ బూమ్రా కొనసాగాడు. అశ్విన్‌కు 870 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియాకు బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ 847తో రెండో స్థానంలో, జస్‌ప్రీత్ బూమ్రా మూడో స్థానంలో కొనసాగుతున్నారు. కగిసో రబడ నాలుగు, పాట్ కమిన్స్ ఐదవ స్థానంలో నిలిచారు. టాప్ 10 బౌలర్లలో రవీంద్ర జడేజా ఏడో స్థానంలో నిలిచాడు. టాప్ 20లో భారత్ బౌలర్లు నలుగురు ఉన్నారు. కాగా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో రోహిత్, యశస్వీ జైస్వాల్, ధర్మశాలలో సెంచరీలు చేసిన రోహిత్ శర్మ, శుభమన్ గిల్ సెట్ట బ్యాట్స్‌మెన్ ర్యాకింగ్స్‌ను మెరుగుపరుచుకున్నారు. రోహిత్ శర్మ ఆరవ స్థానానికి, జైస్వాల్ ఎనిమిదో స్థానానికి ఎగబాకగా, విరాట్ కోహ్లీ ర్యాంకు మాత్రం తొమ్మిదవ స్థానానికి, రిషిత్ పంత్ ర్యాంకు 15వ స్థానానికి దిగజారారు. శుభ్‌మన్‌గిల్ 21వ ర్యాంకుకు చేరుకున్నాడు. కాగా టెస్ట్‌నెంబర్‌వన్ బ్యాట్స్‌మెన్‌గా న్యూజిలాండ్ ఆటగాడుకేన్ విలియ మ్స్ న్ కొనసాగుతుండగా, ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ రెండో స్థానం, పాకిస్థాన్ ప్లేయర్ బాబర్ అజం మూడో స్థానంలో, న్యూజిలాండ్ క్రికెటర్ డారిల్ మిచెల్ నాలుగో స్థానంలో ఉన్నాడు. మరోపక్క టెస్టు ఆల్ రౌండర్ల ర్యాకింగ్స్‌లో రవీంద్ర జడేజా అగ్ర స్థానంలో కొనసాగుతుండగా, అశ్విన్ రెండో స్థానంలో, బంగ్లాదేశ్ ఆటగాడు అల్ హసన్ మూడో స్థానంలో, ఇంగ్లండ్‌కు చెందిన రూట్ నాలుగో స్థానంలో, వెస్టిండీస్ జాసన్ హోల్డర్ ఐదో స్థానంలో ఉండగా, అక్షర్ పటేల్ ఒక ఐదు నుండి ఆరవ స్థానానికి దిగజారాడు.

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు భారీ షాక్

### టోర్నీ నుండి హ్యారీ బ్రూక్ ఔట్

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌కు ముందే అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు భారీ షాక్ తగిలింది. కొద్ది రోజుల క్రితమే ముగిసిన ఐపీఎల్ వేలంలో 4 కోట్ల రూపాయల ధరతో ఢిల్లీ దక్కించుకున్న ఇంగ్లండ్ యువ క్రికెటర్ హ్యారీ బ్రూక్ ఈ సీజన్ నుండి తప్పుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో అతడు ఐపీఎల్ సీజన్ 17 నుండి వైదొలగినట్లు తెలియవచ్చింది. ఈ నెల 22 నుండి మొదలు కాబోయే ఈ లీగ్‌కు దూరమైన రెండో ఇంగ్లస్ క్రికెటర్ బ్రూక్ కావడం విశేషం. ఇప్పటికే రెండు రోజుల క్రితం కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ఓపెనర్ అయిన జేసన్ రాయ్ కూడా వ్యక్తిగత కారణాలతో టోర్నీ నుండి నిష్క్రమించాడు. ఇప్పుడు మరో క్రికెటర్ బ్రూక్ కూడా ఢిల్లీ క్యాపిటల్స్ నుండి తప్పుకోవడం ఐపీఎల్ సీజన్‌లో చర్చనీయాంశమైంది. గడచిన రెండేళ్లుగా ఇంగ్లండ్ టెస్టులలో ఆడుతున్న బజ్‌బాల్ విధానానికి కరెక్ట్‌గా సూటైన బ్రూక్ మిఇలార్డర్‌లో కీలక బ్యాటర్. కొద్ది రోజుల క్రితమే ఇంగ్లండ్ జట్టుకు కూడా భారత్ పర్యటనకు రాగా ఈ టూర్ బ్రూక్ మిస్ అయ్యాడు. సరిగ్గా ఇంగ్లండ్ జట్టు భారత్ రావడానికి కొద్ది రోజుల ముందే అతడు కుటుంబ కారణాలతో ఈ సిరీజ్‌కు దూరమైనట్లు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్ ముగిసినా బ్రూక్ మాత్రం ఐపీఎల్‌కు దూరం కావడం గమనార్హం. కాగా గత సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ 13.25 కోట్ల రూపాయల భారీ ధరతో కొనుగోలు చేసినా బ్రూక్ దారుణంగా విఫలమయ్యాడు. 2023లో ఎస్ఆర్‌హెచ్‌కు ఆడుతూ 190 పరుగులు మాత్రమే చేసిన బ్రూక్‌ను ఆ ఫ్రాంచైజీ వేలానికి వదిలేసింది. దీంతో అతడిని వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ 4 కోట్ల రూపాయలకు దక్కించుకుంది.








AUTHORISED DEALERS: NORTH ANDHRA: VARUN: (SIRIPURAM) CALL: 8912599999, (GAJUWAKA) CALL: 8912599999, (MURALINAGAR) CALL: 8912599999, (SRIKAKULAM) CALL: 8912599999, (RAJAHMUNDRY) CALL: 9985444777. S.B. MOTORS: (RAJAHMUNDRY) CALL: 0883-2442410. SATTI BABU: (KAKINADA) CALL: 0883-2442410. JAYABHERI: (KRANTHI NAGAR) CALL: 7093915512, (VIZIANAGARAM) CALL: 8912505000. E-OUTLETS: VARUN: (PENDURTHY) CALL: 8912599999, (RAJAM) CALL: 8912599999. JAYABHERI: (NARSIPATNAM) CALL: 8912505000, (ANAKAPALLE) CALL: 8912505000, (MADHURWADA) CALL: 8912505000. SATTI BABU: (TUNI) CALL: 0883-2442410. S. B. MOTORS: (AMALAPURAM) CALL: 0883- 2442410.

**Offer includes consumer offer, retail support, exchange offer, and ISL/ Corporate offer (wherever applicable) on Dzire Petrol (AGS variant). ^As per SIAM. #As certified by test agency under Rule 115 of CMVR, 1989. *Auto Gear Shift. Above mentioned mileage is for AMT variant. Terms & Conditions apply. The terms and conditions are subject to change without any prior notice. **Maruti Suzuki reserves the right to withdraw offers at any point in time without any advance notice. Offers valid for limited models and in select states only. Offers may vary subject to the model and variant purchased. Car models and accessories shown may vary from the actual product. Accessories and features shown in the pictures may not be a part of the standard equipment and may vary according to the variant. Black Glass on the vehicle is due to lighting effect. Colours shown may vary from actual body colours due to printing on paper. Images used are for illustration purposes only. Creative visualization. Offers valid till 31st March 2024 or till stocks last, whichever is earlier.


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.